

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 19 ఆగస్టు 2021 సంపుటి : 03 సంచిక :15 పేజీలు : 4 వెల : రూ 3-00


## సీబీఐపై మద్రాస్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

### పంజరంలో చిలకలా ఉన్న సీబీఐకి స్వయంప్రతిపత్తి కల్పించాలి
### ఈసీ, కాగ్ మాదిరి సీబీఐకి స్వయంప్రతిపత్తి కల్పించాలి: మద్రాస్ హైకోర్టు




చెన్నై: కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐని ఉద్దేశించి మద్రాస్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. సీబీఐ పంజరంలో బధించపడిన చిలక అని.. కేంద్రం ఎన్నికల కమిషన్, కాగ్ మాదిరి దానికి స్వయంప్రతిపత్తి కల్పించాలని సూచించింది. ఈ క్రమంలో సీబీఐకి అధిక అధికారాలు, అధికారంతో కూడిన చట్టబద్ధమైన హోదాను అందించే ప్రత్యేక చట్టాన్ని పరిగణలోకి తీసుకుని, అమలు చేయాలని మద్రాస్ హైకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. 'పార్లమెంటుకు మాత్రమే జవాబుదారీగా ఉండే భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ మాదిరిగా సీబీఐకి స్వయంప్రతిపత్తి ఉండాలి. అప్పుడే ప్రజలకు సీబీఐ మీద విశ్వాసం పెరుగుతుంది' అని వ్యాఖ్యానించింది.ప్రస్తుత వ్యవస్థను సరిదిద్దడానికి తాము చేసిన 12 పాయింట్ల సూచనలలో 'పంజరంలోని చిలుకలా ఉన్న సీబీఐని' విడుదల చేసే ప్రయత్నం అని కోర్టు పేర్కొంది. చట్టబద్ధమైన హోదా ఇచ్చినప్పుడు మాత్రమే సంస్థ స్వయంప్రతిపత్తిని నిర్ధారించగలమని గమనించిన న్యాయస్థానం.. 'చట్టబద్ధమైన హోదాను పరిగణనలోకి తీసుకుని భారత ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించి మరింత అధికారం కల్పించాలి.. దీని వల్ల సీబీఐపై ప్రభుత్వ పరిపాలనా నియంత్రణ లేకుండా క్రియాత్మక స్వయంప్రతిపత్తి కలుగుతుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది.తమిళనాడులోని పోంజి కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. జస్టిస్ ఎన్ కిరుబకరన్, జస్టిస్ బీ పుగళేందిల ధర్మాసనం ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా.. 'ఎలక్షన్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ మాదిరిగా సీబీఐ మరింత స్వయంప్రతిపత్తిగా ఉండాలి.. సీబీఐ డైరెక్టర్‌కు ప్రభుత్వ కార్యదర్శిగా అధికారాలు ఇవ్వబడతాయి.. డీఓపీటీ ద్వారా కాకుండా నేరుగా మంత్రి/ ప్రధాన మంత్రికి నివేదించాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.కాగా, సంస్థలో మానవవనరుల కొరతతో ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించలేమని కేంద్రం పేర్కొంది. దీంతో ఈ అంశంపై నెల రోజుల్లోగా సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని మద్రాస్ హైకోర్టు సూచించింది. 1941లో ఏర్పడిన సీబీఐ.. ప్రధాన మంత్రి కార్యాలయం అధీనంలో ఉండే డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రెయినింగ్ (డీఓపీటీ)కు బాధ్యత వహిస్తోంది. దీని డైరెక్టర్‌ను ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేతతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం ఎంపిక చేస్తుంది.

## ఆటోమొబైల్ తయారీకి కేంద్రంగా భారత్



న్యూఢిల్లీ : రాబోయే ఐదేళ్లలో భారత్ ఆటోమొబైల్ తయారీకి కేంద్రంగా మారుతుందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు. దాదాపు అన్ని ప్రఖ్యాత ఆటోమొబైల్ బ్రాండ్లు దేశంలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇథనాల్, బయో-డీజిల్, కాంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (అఔఉ), లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఒఔఉ), ఎలక్ట్రిక్ అండ్ గ్రీన్ హైడ్రోజన్‌తో కూడిన టెక్నాలజీలపై పని చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా రాబోయే ఐదేళ్లకాలంలో భారత్ ఆటోమొబైల్ తయారీకి కేంద్రంగా మారుతుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు.ఈ నెల 13న గుజరాత్‌లో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ప్రధాని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త స్క్రాపేజ్ విధానాన్ని ప్రారంభించారు. దీంతో అపరిశుభ్రమైన, కాలుష్యం కలిగించే వాహనాలను నిర్మూలించడంలో సహాయపడుతుందని, ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఈ విధానం భారతదేశ మొబిలిటీ, ఆటో రంగానికి కొత్త గుర్తింపును ఇస్తుందన్నారు. ఇథనాల్, హైడ్రోజన్ ఫ్యూయల్, ఎలక్ట్రిక్ మొబిలిటీలో పరిశ్రమలు చురుగ్గా పాల్గొనడం ఎంత ముఖ్యమో.. మన పర్యావరణం, మన భూమి, మన వనరులు, మన ముడిసరుకును కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు.

## వైసీపీ నవరత్నాల పేరుతో నవ మోసాలు చేసింది: బోండా ఉమ



అమరావతి: పేదలకు నవరత్నాలు అని చెప్పి వైసీపీ నవ మోసాలు చేసిందని టీడీపీ నేత బోండా ఉమ విమర్శించారు. ఈకేవైసీ ఉంటేనే బియ్యం ఇస్తామని పేదవాళ్ళను ముప్పు తిప్పలు పెడుతున్నారన్నారు. వేలి ముద్రలు మళ్లీ వేస్తేనే బియ్యం ఇస్తామని రేషన్ ఎగ్గొడుతున్నారన్నారు. రాష్ట్రంలో పేదలందరూ ఆధార్ సెంటర్ల వద్దే ఉన్నారన్నారు. కాపు మహిళలకు కాపు నేస్తం అందరికీ ఇస్తామని... 25 శాతం మంది మహిళలకే ఇచ్చారని బోండా ఉమ పేర్కొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ఆనాటి ఉద్యమకారుల మనోగతం

విశాఖపట్నం విశాఖ స్టీల్ ప్లాంటు అమ్మి తీరుతామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రకటించింది. అందుకుగానూ వేగంగా పావులు కదుపుతోంది కేంద్రం.విశాఖ స్టీలు ప్లాంట్ను కొనుగోలు చేసేందుకు టాటా స్టీల్ ఆసక్తి కనబరుస్తున్నట్టు తెలుస్తోంది.రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ ను కొనుగోలు చేసేందుకు టాటా స్టీల్ ఆసక్తి చూపుతోంది. ప్రస్తు తం కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉక్కు కర్మాగారం 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగి ఉంది.భారతదేశంలో సముద్ర తీరాన ఉన్న అతి పెద్ద సమగ్ర ఉక్కు కర్మాగా రం. విశాఖ ప్లాంట్ దక్షిణాన, తూర్పు తీర ప్రాంతంలో ఉన్న ఈ ఉక్కు కర్మా గారానికి అనేక అదనపు అవకాశాలు న్న సంస్థకు దేశీయ అవసరాలను తీర్చేందుకు తగ్గట్లుగా రైలు, రహదా రులు సౌక ర్యాలున్నాయి.దాంతో పాటు ఇప్పటికే ఆగ్నేసియా మార్కెట్ల తో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తు న్న టాటా స్టీల్ ను దక్కింకునేందుకు టాటా స్టీల్ ఆసక్తి చూపడంపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.మరోవైపు కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ను ప్రవేటీకరణ చెయ్యడంపై ఆనాటి ఉద్య మంలో పాల్గొన్న స్థానికులు ఆవేదన చెందుతున్నారు.బీజేపీ ప్రభుత్వం వ్యాపార దృక్పథంతో కాకుండా ప్లాంట్ ను పరి రక్షించే విధానం చర్యలు తీసుకోవాలని రమేష్,వెంకటేశ్వర రావు కోరారు.

## లోకేష్ ప్రవర్తన జుగుప్సాకరంగా ఉంది: ఎమ్మెల్సీ ఇక్బాల్



అనంతపురం: లోకేష్ ప్రవర్తన జుగుప్సాకరంగా ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇక్బాల్ ధ్వజమెత్తారు. విద్యార్థిని రమ్య హత్య దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రమ్య మృతదేహాన్ని తరలించే అంబులెన్స్‌ను అడ్డుకోవడం దారుణమని, టీడీపీ శవ రాజీకాయాలు మానుకోవాలని హితవు పలికారు. పోలీసులపై దాడి సరికాదని, టీడీపీ ఎల్లోమీడియా వక్రభాష్యం మానుకోవాలని మండిపడ్డారు. లోకేష్‌కు చిత్తశుద్ధి ఉంటే వాళ్ళ చిన్నాన్న రామూర్తిని ఎందుకు పరామర్శించలేదని సూటిగా ప్రశ్నించారు. యాసిడ్ బాధితురాలికి కోర్టు ఆదేశించినా చంద్రబాబు రూ.5 లక్షల పరిహారం ఇవ్వలేదని గుర్తు చేశారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకే టీడీపీ కుట్ర చేస్తోందన్నారు


## రాష్ట్రాలకు 57.88 కోట్ల వ్యాక్సిన్ డోసుల పంపిణీ: కేంద్రం

న్యూఢిల్లీ: కరోనా మహమ్మారి కట్టడి కోసం దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియ నిరంతరాయంగా సాగుతున్నది. అందుకోసం కేంద్రం ఎప్పటికప్పుడు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వ్యాక్సిన్‌లనుపంపిణీ చేస్తున్నది. ఇప్పటివరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మొత్తం 57.88 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.



త్వరలో మార్గమధ్యలో ఉన్న మరో 18,62,530 డోసులు రాష్ట్రాలకు చేరుకోనున్నాయని కేంద్ర వైద్యారోగ్య శాఖ తెలిపింది.కాగా, వృథాగా పోయిన వాటితో కలిపి బుధవారం ఉదయం 8 గంటల వరకు దేశవ్యాప్తంగా 55,11,64,635 వ్యాక్సిన్ డోసులను వినియోగించినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల దగ్గర 94 లక్షల వ్యాక్సిన్ డోసులు నిలువ ఉన్నాయని తెలిపింది.

## ఎస్‌డీసీ ద్వారా రుణాల సేకరణపై హైకోర్టులో విచారణ




అమరావతి: ఎస్‌డీసీ ద్వారా రుణాల సేకరణపై హైకోర్టులో విచారణ జరగనుంది. పిటిషనర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది బసవప్రభు పాటిల్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులను కన్సాల్డేట్ ఫండ్‌కు జమచేయకుండా.. ఎస్క్రో చేయడం నిబంధనలకు విరుద్ధమని బసవప్రభు పాటిల్ తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 266, 202, 204కు వ్యతిరేకమన్నారు. కేసు విచారణను ఏపీ హైకోర్టు ఈ నెల 26కి వాయిదా వేసింది.

## రమ్య హత్య పోలీసు వైఫల్యం కాదా: ఆలపాటి రాజా

గుంటూరు: రక్షక యంత్రాంగం భక్షక యంత్రాంగంలా మారిపోయిందని టీడీపీ నేత ఆలపాటి రాజా ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పరామర్శించటానికి వెళ్లినందుకు వైసీపీ రాజకీయం చేసిందని మండిపడ్డారు. తమపై ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్‌లు చూస్తే పోలీస్ వ్యవస్థ ఎంత నిర్వీర్యం అయ్యిందో అర్థమవుతోందన్నారు. రమ్య హత్య పోలీసు వైఫల్యం కాదా అని ఆలపాటి రాజా ప్రశ్నించారు. గుంటూరులో హత్యకు గురైన రమ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న టీడీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దారుణం ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. పోలీసులు అధికారానికి తలొగ్గటం మానుకోవాలని హితవు పలికారు.




## సెప్టెంబర్ జీ11న మరోసారి లోక్ అదాలత్ ప్రారంభిస్తాం: రత్నప్రసాద్

గుంటూరు: వచ్చే నెల పదకొండున మరోసారి లోక్ ఆదాలత్ ప్రారంభిస్తున్నామని సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్ తెలిపారు. ప్రతి రెండు నెలలకొకసారి జాతీయ లోక్ ఆదాలత్ జరిగేదని...కరోనాతో కొద్ది రోజులుగా లోక్ ఆదాలత్ నిలిపివేశామన్నారు. సెప్టెంబర్ 11న మరోసారి లోక్అదాలత్‌ను ప్రారంభిస్తామని...ప్రతి కోర్టులో ఒక బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కక్షిదారులంతా ఈ లోక్ అదాలత్‌లో పాల్గొని కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఫిజికల్, వర్చువల్‌గా లోక్ అదాలత్ జరుగుతుందని ఆయన అన్నారు. భీమా కంపెనీలతో ముందస్తు సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, చెక్ బౌన్స్ కేసులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని అన్నారు. రెండు లక్షల రూపాయలలోపు ఉన్న చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ముందస్తుగా సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతంలో 2266 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. ఈ సారి మరింత ఎక్కువ కేసుల పరిష్కారం అవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. డీఎల్ఎస్ఏ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. లోక్ ఆదాలత్‌లో సెటిల్ అయితే అప్పీల్‌కు వెళ్ళే అవకాశం లేదని...ఫైనల్ జడ్జిమెంట్‌గా పరిగణిస్తారని రత్నప్రసాద్ వెల్లడించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో 20న మొహర్రం సెలవు



అమరావతి: మొహర్రం మాసం 10వ రోజు ఇచ్చే సాధారణ సెలవును ఆగస్టు 19వ తేదీ (గురువారం) నుంచి 20వ తేదీ (శుక్రవారం)కి మారుస్తూ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 20న మొహర్రం నిర్వహణకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీ జామా మసీదు ప్రకటన ఆధారంగా మొహర్రం నిర్వహణ తేదీల్లో మార్పులు చేసినట్టు ఒక ప్రకటనలో పేర్కొంది.

## సీబీఐకి స్వతంత్ర ప్రతిపత్తి

### కేంద్రానికి మద్రాస్ హైకోర్టు కీలక సూచన

చెన్నై : పంజరంలోని చిలకలా మారిన సీబీఐకి స్వతంత్ర ప్రతిపత్తితో స్వేచ్ఛను ప్రసాదించాలని మద్రాస్ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఎన్నికల కమిషన్, కాగ్ తరహాలో సీబీఐకి విస్తృత అధికారాలు కల్పించేలా చట్టం తీసుకురావాలని స్పష్టం చేసింది. సీబీఐకి వనరులు, సిబ్బంది పరిమితంగా ఉండటంతో విచారణ చేపట్టాల్సిన అవసరం తలెత్తినప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థ తటపటాయిస్తోందని పేర్కొంది.పరిమిత వనరులతో అది దర్యాప్తును చేపట్టలేకపోతోదని, న్యాయస్థానాల ఎదుట సీబీఐ తన లోటుపాట్లను ఏకరువు పెట్టడం సర్వసాధారణమైందని జస్టిస ఎన్ కిరుబకరన్, జస్టిస్ పుగలేందితో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. సీబీఐకి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులు చేపట్టాలని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. డిప్యుటేషన్‌పై ఆధారపడకుండా సీబీఐ కోసం ప్రత్యేకంగా పనిచేసే అధికారులు ఉండాలని స్పష్టంచేశారు.

## సబ్‌రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా ఎంపికైన వారి జాబితా విడుదల




అమరావతి: గ్రూప్-2 సబ్‌రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా ఎంపికైన వారి జాబితాను ఏపీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్?సైట్?లో ఉంచినట్టు సహకార శాఖ కమిషనర్ ప్రకటన జారీ చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారి తుది జాబితాను పొందుపరిచినట్లు తెలిపారు

# సంపాదకీయం

గురువారం 19 ఆగస్టు 2021

## కొరడా ఝుళిపిస్తున్న న్యాయవ్యవస్థ

వ్యవస్థలు కుమ్మక్కై దేశాన్ని వక్రమార్గం పట్టిస్తున్నాయి. బాధ్యత వహించాల్సిన పాలకులు, అధికారులు భాగస్వాములుగా మారుతున్నారు. ఇందులో రాజకీయ నేతలది మొదటి స్థానం. దర్యాప్తు సంస్థలది రెండో స్థానం. నిన్నామొన్నటివరకూ చూసీ చూడనట్లు వ్యవహరించిన సర్వోన్నత న్యాయస్థానం కొరడా ఝుళిపిస్తానంటూ హెచ్చరిస్తోంది. చాలా కాలంగా ప్రభుత్వాలు కోర్టు తీర్పులను చిత్తశుద్ధితో అమలు చేయడం లేదు. సాకులు వెదుకుతున్నాయి. కోర్టుల విచారణలను ఆలస్యం చేయడం, అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందచేయకుండా నాన్చడం వంటి చర్యల ద్వారా న్యాయప్రక్రియకు ప్రభుత్వ యంత్రాంగాలే అడ్డుతగులుతున్నాయి. విచారణ సంస్థల వ్యవహార శైలిని, ప్రభుత్వాల తీరును సుప్రీం కోర్టు అభిశంసిస్తూ ఘాటు వ్యాఖ్యలే చేస్తోంది. యంత్రాంగం సహాయ నిరాకరణ నేపథ్యంలో సుప్రీం కోర్టు దేశంలో న్యాయం కోసం ఒంటరి పోరాటమే చేస్తున్నట్లు కనిపిస్తోంది. అధికారంలో ఎవరు ఉన్నప్పటికీ న్యాయవ్యవస్థను ప్రభావితం చేయడానికి తమ వంతు ప్రయత్నం చేస్తూనే ఉంటారు. రకరకాలుగా ప్రలోభాలు పెడుతుంటారు. ఇందిరా గాంధీ కాలం నుంచే ఇది అలవాటుగా మారింది. ప్రభుత్వ ఉద్దేశాలను గ్రహించి తదనుగుణంగా న్యాయాన్ని వేగవంతం చేయగలిగిన వారు ఆశ్రితుల జాబితాలో ఉంటుంటారు. పదవీ విరమణ తర్వాత కూడా ఉన్నత పదవులు దక్కుతుంటాయి. అయితే తాజాగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేంద్రానికి చుక్కలు చూపిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా తనకు దఖలైన అధికారాలతో కేంద్రం ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. సీబీఐ ను చెప్పుచేతల్లో పెట్టుకుంటున్న కేంద్రం దానికి డైరెక్టర్ నియామకం లో తనకు నచ్చిన వారికి పట్టం గట్టాలని ఇటీవల ప్రయత్నం చేసింది. అయితే పదవీ విరమణ కు కనీసం ఆరునెలల వ్యవధి తక్కువ ఉండకూడదు. ఆ నిబంధనలు ఎత్తి చూపించి చీఫ్ జస్టిస్ ప్రభుత్వ ఉద్దేశానికి గండి కొట్టారు. అలాగే కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణలకు సంబంధించి సకాలంలో సరైన సమాచారం ఇవ్వడం లేదన్న అంశాన్ని తీవ్రంగా తీసుకుంటూ హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున న్యాయాధికారి క్షమాపణ చెప్పుకోవాల్సి వచ్చింది. రాజకీయ ఆశ్రితులు ఉన్న కేసుల్లో ప్రభుత్వ దర్యాప్తులు నత్తనడకన సాగుతుంటాయి. అందుకు విచారణ సంస్థలు సహకరిస్తుంటాయి. సుప్రీంకోర్టు ఈ విషయంలో సీరియస్ అవుతుండటంతో గాడిన పడటానికి ఆస్కారం ఏర్పడుతోంది. పాలిటిక్స్ లో ఉన్న వాళ్లు ఆడింది ఆట, పాడింది పాటగా చెలాయిస్తుంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నచ్చినట్లు కేసులు ఎత్తి వేయించుకుంటుంటారు. దీనికి చెక్ పెడుతూ ప్రజాప్రతినిధులపై కేసుల ఎత్తవేతకు హైకోర్టు అనుమతి అవసరమని సుప్రీం కోర్టు నిర్దేశించింది. ఇది ఒక రకంగా ప్రభుత్వాల ఇష్టారాజ్యానికి లక్ష్మణ రేఖ గీయడమే. అదే విదంగా ఏడాది లోపు ప్రజాప్రతినిధులపై కేసులను కొలిక్కి తేవాలని హైకోర్టులకు గతంలోనే సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. వివిధ రకాల కేసుల్లో పాత్ర ఉన్న వారిని అభ్యర్థులుగా నిలుపుతూ పార్టీలు రాజకీయం చేస్తున్నాయి. గెలుపు అవకాశాలనే పరిగణనలోకి తీసుకుంటూ రాజకీయాలను కలుషితం చేస్తున్నాయి. కనీసం తాము ఎన్నుకుంటున్న ప్రతినిధులపై ఉన్న కేసుల వివరాలను ప్రజల దృష్టిలో పెట్టడం లేదు. ఎన్నికలలో పోటీ పడుతున్న అభ్యర్థుల పూర్తి వివరాలు ప్రచురించాలని గతంలోనే సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయి. కానీ వాటిని పార్టీలు పూర్తి స్థాయిలో పట్టించుకోవడం లేదు. బిహార్ లో ఈరకంగా నిర్లక్ష్యం వహించినందుకు బీజేపీ, కాంగ్రెసు, సీపీఎం సహా ఎనిమిది పార్టీలకు జరిమానా విధించింది సుప్రీం కోర్టు. అంతేకాకుండా భవిష్యత్తులో ఇదే తీరు పునరావృతమైతే ఆయా పార్టీల ఎన్నికల చిహ్నాలు రద్దు చేయడానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. పార్టీలకు ఇది కఠినమైన హెచ్చరికే. భారత రాజకీయ వ్యవస్థలో ఏదైనా సాధ్యమనే భావన ఏర్పడింది. దేశంలో నలభై శాతం ఎమ్మెల్యేలు, ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయి. అందులో కనీసం 15 శాతం మందిపై తీవ్రమైన నేరారోపణలున్నాయి. అయినా వారి కేసులకు పురోగతి ఉండటం లేదు. కోర్టుల్లో ఏళ్లతరబడి ఎటూ తేలడం లేదు. న్యాయ విచారణకు దర్యాప్తు సంస్థలు సహకరించడం లేదు. ఆ మేరకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలను, యంత్రాంగాన్ని మేనేజ్ చేయగలుగుతున్నారు. అధికారంలో ఉన్న పార్టీలకు ఎమ్మెల్యేలు, ఎంపీల మద్దతు అనివార్యం. దాంతో ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తు సంస్థల పనిని మందగింప చేస్తున్నారు. నేరగాళ్లు, అక్రమార్కులు అందలం ఎక్కుతున్నారు. ఇటువంటి దుస్థితిలో దేశంలో న్యాయవ్యవస్థ ఒక్కటే ఆశాకిరణంగా కనిపిస్తోంది. ఆ వ్యవస్తలోనూ అనేక రకాల లోపాలున్నాయి. అయినా మిగిలిన రాజకీయ, పాలన యంత్రాంగాలతో పోల్చుకుంటే ఎంతో కొంత రుజువర్తన కారణంగానే ప్రజా విశ్వాసం పొందగలుగుతోంది. న్యాయవ్యవస్థ కూడా ప్రమాణాలు కోల్పోతే దేశంలో అరాచకత్వం ప్రబలిపోతుంది. ప్రజలలో రాజ్యంపై నమ్మకం సడలిపోతుంది. అది దేశానికి ప్రమాదకరం.

# ఆ నలుగురికి నిరాశేనా

గుంటూరు, ఆగస్టు 18, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. హామీలు ఇచ్చి కూడా మరిచిపోవచ్చు. సమయానికి తగిన సేవ చేయించుకుని తర్వాత.. పక్కన పెట్టొచ్చు. ఇప్పుడు ఇలాంటి పరాభవంతోనే కుమిలిపోతున్నారు.. గుంటూరు జిల్లాకు చెందిన నలుగురు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు. ఈ నలుగురు కూడా గత ఎన్నికల సమయంలో టికెట్లను త్యాగం చేసి.. జగన్ మాటపై విశ్వాసంతో.. పార్టీ కోసం పనిచేశారు. పార్టీని గెలిపించేందుకు కృషి చేశారు. ఈ క్రమంలో జగన్.. ఆయా నేతలకు గట్టి హామీలే ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు అంటే.. అధికారం చేపట్టి.. రెండున్నరేళ్లు గడిచిపోయినా.. వీరిని కనీసం పట్టించుకోకపోవడం దారుణమని అంటున్నారు వీరి అనుచరులు. విషయంలోకి వెళ్తే.. టీడీపీకి బలమైన కంచుకోటగా ఉన్న వినుకొండ నియోజకవర్గంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న జీవీ ఆంజనేయులును ఓడించేందుకు వైసీపీ కీలక అస్త్రం ప్రయోగించింది. ఆయనే మక్కిన మల్లికార్జున రావు. గత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి.. లావు శ్రీకృష్ణదేవరాయలు.. ఈయనను ముందు పెట్టి.. ఇక్కడ రాజకీయం నడిపించారు. ఈ క్రమంలో వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడు.. విజయం దక్కించుకున్నారు. అయితే.. ఎన్నికల సమయంలో నామినేటెడ్ పదవికానీ.. ఎమ్మెల్సీ కానీ.. ఇస్తామని ఆశపెట్టినా.. తర్వాత.. మక్కినను అటు లావు, ఇటు జగన్ ఎవరూ పట్టించుకోలేదు. ఇక, మరో టీడీపీ కంచుకోట.. పొన్నూరు. ఇక్కడ వరుసగా ఐదు ఎన్నికల్లోనూ టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర విజయం దక్కించుకున్నారు. అయితే.. ఇక్కడ రావి వెంకటరమణను వాడుకున్న వైసీపీ.. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆయనను ఇక్కడ ఇంచార్జ్‌గా ఉంచింది. జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచి పొన్నూరు ఇన్‌చార్జ్‌గా ఆయనే ఉన్నారు. అయితే.. ఎన్నికల సమయానికి ఆయనను పక్కన పెట్టి.. కిలారు రోశయ్యకు టికెట్ ఇచ్చారు. టికెట్ త్యాగం చేయడంతోపాటు.. రోశయ్య గెలుపునకు రావి బాగా కృషి చేశారు. అయితే.. ఆయనను కూడా ఇప్పటి వరకు జగన్ పట్టించుకోలేదు. చివరకు ఇటీవల నామినేటెడ్ పదవులు ఇచ్చినా రావి పేరు పరిగణలోకి తీసుకోలేదు. మరో నేత గురించి చూస్తే.. దేవినేని మల్లికార్జున రావు. ఈయనను ఏకంగా రెండు నియోజకవర్గాల్లో వాడుకున్నారు. అటు వేమూరు, ఇటు రేపల్లె నియోజకవర్గాల్లో ఆయన సేవలు వినియోగించుకుని గెలుపు గుర్రం ఎక్కేందుకు ప్రయత్నించారు. అయితే.. రేపల్లె తప్ప వేమూరులో వైసీపీ విజయం దక్కించుకుంది. కానీ.. మల్లికార్జున రావును మాత్రం అందరూ మరిచిపోయారు. ఎన్నికల వేళ మల్లిఖార్జున రావును పనిగట్టుకుని మోపిదేవి, మేరుగ నాగార్జున జగన్ దగ్గరకు తీసుకువెళ్లి పార్టీలో చేర్చుకున్నారు. అదే సమయంలో గత ఎన్నికల సమయంలో మరో కీలక నియోజకవర్గం.. చిలకలూరిపేట టికెట్‌ను త్యాగం చేసిన మర్రి రాజశేఖర్‌కు పార్టీ అధికారంలోకి రాగానే మంత్రి పదవి ఇస్తానని? స్వయంగా జగనే బహిరంగ వేదికపై హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఎమ్మెల్సీనే ఇవ్వలేదు. దీంతో ఈ నలుగురు కమ్మసామాజిక వర్గానికి చెందిన నేతలకు జగన్ హ్యాండిచ్చారా? అనే చర్చ జోరుగా సాగుతుండడం గమనార్హం.

# జగన్ లో కనిపిస్తున్న నిర్వేదం

విజయవాడ, ఆగస్టు 18, (న్యూస్ పల్స్)జగన్ ఇపుడు ఒక రకమైన అద్వైత స్థితిలో ఉన్నారు. రాజకీయాల్లో వేదాంతానికి తావు లేదు కానీ జగన్ పరిస్థితి మాత్రం అలాగే ఉంది అంటున్నారు. ఆయనకు అసలు తత్వం పూర్తిగా బోధపడింది. తన దూకుడు పార్టీలోనే తప్ప పాలనలో పనిచేయదు అని జగన్ గ్రహించారు అంటున్నారు. జగన్ పార్టీలో ఎన్ని కఠోర నిర్ణయాలు తీసుకున్నా నోరు మెదిపేవాడే లేడు.. అడిగే వాళ్లే ఉండరు. ఎవరికి ఎంత కోపం ఉన్నా అణుచుకుని ఉండాల్సిందే. అదే పాలనలో అలా కుదరదు.. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదు. అదే విధంగా తాను చెప్పినట్లుగా చకచకా పనులు కావడానికి కేంద్రంలోని బీజేపీ పెద్దలు తనకు నిజమైన మిత్రులు కాదన్న సత్యాన్ని కూడా జగన్ అవగతం చేసుకున్నారని అంటున్నారు. దాంతో జగన్ ఇపుడు ఏం జరగాలో అదే జరుగుతుంది అన్న నిర్వేదానికి వచ్చేసినట్లుగా చెబుతున్నారు. ఏపీలో రాజకీయం అంతా జగన్ ని గురి పెట్టి ఉంది. సాధారణంగా విపక్షాలు అధికార పక్షాన్ని టార్గెట్ చేయడం వేరు. జగన్ విషయం వేరు. జగన్ కి మొదటి నుంచి రాజకీయాలకు అతీతంగా శత్రువులు ఉన్నారు. వారు మరింతంగా పెరిగిపోతున్నారు కూడా. ఇక జగన్ మిత్రులుగా కూడా ఎవరినీ భావించరు. తన రాజకీయం ఏంటో తానేంటో అన్నట్లుగా ఉంటారు. అలాంటి జగన్ తన మనస్తత్వానికి భిన్నంగా బీజేపీతో మైత్రి నడిపారు. కేంద్రంలోని మోడీని బాగా కీర్తించారు. ఆయన తిరుపతి వచ్చినపుడు ఏకంగా కాళ్ళ మీద పడి నమస్కారం చేయాలని చూశారు. ఇన్ని చేసినా కూడా బీజేపీ ఆలోచనలు మారవు. వారు టైమ్ దొరికితే తమ టార్గెట్ ని ఠక్కున ఫినిష్ చేస్తారు. ఏపీలో కూడా ఇపుడు వారిది అదే చూపు, అదే వేట కూడా. ఏపీలో జగన్ కి గతం కంటే మద్దతు తగ్గిందని సర్వేలలో వస్తున్న నేపథ్యంలో ఆయన రాజకీయం ఏమైనా జరగవచ్చు అంటున్నారు.

జగన్ బెయిల్ రద్దు పిటిషన్ ఒక వైపు కోర్టులో ఉంది. ఆ తీర్పు ఎలా వస్తుందో ఎవరికీ తెలియవు. మరో వైపు చూస్తే అక్రమాస్తుల కేసు జోరుగా సాగుతోంది. బహుశా వచ్చే ఏడాది దాని తీర్పు వెలువడవచ్చు అంటున్నారు. ఇక చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ కొలిక్కి వస్తే ఆ కథ ఎటు మలుపు తిరుగుతుందో చూడాలి. ఇక ఏపీ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఛిన్నాభిన్నం కావడం? ఇలా జగన్ కి చాలా తలనొప్పులు ఉన్నాయి. అయితే జగన్ ఒక్కటే భావిస్తున్నట్లుగా ఉంది. తనను పాల ముంచినా నీట ముంచినా ఒక్కటేనని ఆయన అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. కేసుల బెడద లేకుండా ఉంటే సజావుగా పాలన చేసుకుంటారు. లేకపోతే జైలుపాలు అయినా కూడా తనకు ఓకే అన్నట్లుగానే జగన్ ధోరణి ఉందని పార్టీ నేతల్లోనే చర్చ నడుస్తోంది. అది కూడా సానుభూతిని పెంచేదిగానే ఉంటుందని ఆయన అంచనా వేసుకుంటున్నట్లుగా చెబుతున్నారు

# అనకాపల్లిపైనే సత్యవతి దృష్టంతా..

విశాఖపట్టణం, ఆగస్టు 18, (న్యూస్ పల్స్) ఆమెను అంతా లక్కీ ఎంపీ అంటారు. అవును మరి ఎన్నికలు దగ్గర పడుతున్నదాకా ఆమె అనకాపల్లి ఎంపీ క్యాండిడేట్ అని ఆమెకే తెలియదు. కాంగ్రెస్ లో ఒక సాధారణ నాయకురాలిగా ఉన్న ఆమె ఇలా వైసీపీలో చేరగానే అలా ఎంపీ టికెట్ ఇచ్చేశారు జగన్. అంతే కాదు, వైసీపీ ఊపులో ఆమె మంచి మెజారిటీతో గెలిచి దేశంలోని అత్యున్నత చట్ట సభలో మెంబర్ అయిపోయారు భీశెట్టి సత్యవతి. ఇక రెండున్నరేళ్ళు కావస్తోంది. ఆమె ఎంపీగా ఏమైనా చేశారా అంటే లేదు అని సొంత పార్టీ వారే అంటారు. మరో వైపు ఆమెకు స్థానికంగా కూడా పార్టీ నుంచి సహకారం కూడా పెద్దగా లేదు. అయితే భీశెట్టి సత్యవతి తన రాజకీయ జీవితాన్ని లక్కీగా భావించడంలేదు. వీలైతే మరింతకాలం పొడిగించుకోవాలని చూస్తున్నారు. ఆమె విశాఖ ఎంపీ విజయసాయిరెడ్డితోనూ బాగానే ఉంటూ వస్తున్నారు. ఇపుడు ఏకంగా జగన్ తో కూడా గుడ్ రిలేషన్స్ మెయింటెయిన్ చేయాలని అనుకుంటున్నారు. ఈ మధ్య ఎంపీలతో జగన్ సమావేశం నిర్వహిస్తే అదే అదనుగా భీశెట్టి సత్యవతి జగన్ తో కొంతసేపు సమావేశమై తన నియోజకవర్గంలోని సమస్యలను ప్రస్థావించారు. అదే విధంగా స్థానికంగా ఉన్న రాజకీయ పరిస్థితులను కూడా ఆమె ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారని స్థానికంగా చర్చ నడుస్తోంది. జగన్ కూడా భీశెట్టి సత్యవతి చెప్పిన అన్ని విషయాలను సానుకూలంగా విన్నారని అంటున్నారు. తనకు పార్టీలో జరుగుతున్న అవమానాలు, ప్రత్యేకించి లోకల్ ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ రాజకీయాలు కూడా ఆమె అధినేత దృష్టికి తెచ్చారని అంటున్నారు. దాంతో పాటుగా తాను అనకాపల్లిలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా జగన్ కి వివరించారని అంటున్నారు. మొత్తానికి తనకు ఎంపీగా ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంలేదని ఆమె ఫిర్యాదు చేసినట్లుగా మాత్రం తెలుస్తోంది. ఒక ఎంపీగా ఉంటూ ఎంతో చేయాలనుకున్న లోకల్ లీడర్స్ వల్లనే చేయలేకపోతున్నట్లుగా భీశెట్టి సత్యవతి వివరణ ఇచ్చారని తెలుస్తోంది. జగన్ కూడా పరిస్థితులు అన్నీ గమనిస్తున్నారని, తొందరలోనే ఎంపీ భీశెట్టి సత్యవతి లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అని అనుచరులు అంటున్నారు. మొత్తానికి గుడివాడ జోరు తగ్గించాలన్నదే ఎంపీ భీశెట్టి సత్యవతి వర్గీయుల డిమాండ్ గా ఉంది. మొత్తానికి ఇంతకాలం సైలెంట్ గా ఉన్న ఎంపీ తనదైన రాజకీయానికి తెర తీశారు అంటున్నారు. అయితే అనకాపల్లి పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నా కూడా సత్యవతి దృష్టంతా అనకాపల్లి మీదే ఉందన్న మరో చర్చ కూడా ఉంది. వచ్చే ఎన్నికల్లో ఆమె ఇక్కడ నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్నా ? ఆమెకు ఎలాగూ టిక్కెట్ రాదు. అయితే ఈ సీటుపై కాచుకుని ఉన్న దాడి వీరభద్ర రావు డైరెక్షన్‌లోనే ఆమె ఇక్కడ సరికొత్త రాజకీయం స్టార్ట్ చేశారని మరో టాక్ ? దీని ఫలితాలు, పర్యవసానాలు ఏంటో చూడాల్సి ఉంది.

# ప్రభుత్వ పాఠశాలలో అంగన్ వాడీ

గుంటూరు, ఆగస్టు 18, (న్యూస్ పల్స్)ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల విలీనానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కరోనా తరువాత సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బడులను ప్రారంభించడంతో ఈ పనులను మరింత వేగవంతం చేసింది. ప్రభుత్వ పాఠశాలలకు కిలోమీటరు దూరంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలని ఇప్పటికే ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు 3,793 అంగన్ వాడీ కేంద్రాలు స్కూళ్లకు దగ్గర్లో ఉన్నాయని గుర్తించారు. వీటిలో ముందుగా అద్దె భవనాల్లో ఉన్న కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లోకి తరలించాలని చెప్పడంతో వాటిని గుర్తించే పనిలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ నిమగ్నమైంది. ఈ అంగన్‌వాడీ కేంద్రాలన్నిటినీ పాఠశాలల్లోకి తరలించడం వల్ల కొన్నిచోట్ల గదులు చాలవని గుర్తించారు. దీంతో అదనపు గదులను నిర్మించేంత వరకూ అంగన్‌వాడీ కేంద్రాలను యథావిధిగా ఉన్నచోటే కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు కిలోమీటరు దూరంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేసి వాటిని ప్రీ ప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2గా పేరు మార్చనున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు దూరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లుగా పేరు మార్చి వాటిలో కూడా ప్రీ ప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2 తరగతులను నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేసిన తరువాత పాత పద్ధతిలోనే ఈ ప్రీ ప్రైమరీ 1, 2 తరగతులకు అంగన్‌వాడీ టీచర్లే పాఠాలను బోధించను న్నారు. నిర్వహణ బాధ్యతను స్త్రీ శిశు సంక్షేమ శాఖనే చూడనుంది. విలీనానికి ఎటువంటి ఇబ్బందీ లేకపో యినా కొన్నిచోట్ల గదులు చాలవని విద్యాశాఖ చెబుతోంది. దీంతో ఎక్కడెక్కడ ఎన్ని అదనపు గదులు అవసరం, నాడు-నేడులో ఇప్పటి వరకూ ఎన్ని గదులను నిర్మించారు? వంటి వివరాలను ప్రభుత్వం కోరినట్లు తెలు స్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటి వరకూ గర్భిణులు, బాలింతలు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ కింద తీసుకుంటున్న పౌష్టికాహారాన్ని కూడా ఇక మీదట స్కూళ్లకు వెళ్లే తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారునూతన విద్యావిధానంలో భాగంగా ఆరు రకాల పాఠశాలల ఏర్పాటు విధివిధానాలపై పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే కొన్ని నిర్ణయాలను విద్యాశాఖ తీసుకుంది. ప్రీ ప్రైమరీ-1 (పిపి1), ప్రీ ప్రైమ రీ-2 (పిపి2) తరగ తులు, ఉద్యోగులతో విద్యా శాఖకు సంబంధం ఉండదు. శిశుసంక్షేమ శాఖలో ఉంటాయని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. వారికి కావాల్సిన బోధనా సామగ్రి మాత్రం విద్యాశాఖ అందిస్తుంది. అంగన్‌వాడీల్లోని పిపి-1, పిపి-2 తరగతుల బోధనను ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులు పర్యవేక్షిస్తారు. 1, 2 తరగతులు బోధించే ఎస్‌జిటిలు, పాఠశాలలు విద్యాశాఖ పరిధిలోనే ఉంటాయి. ప్రాథమిక పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉన్న అంగన్‌వాడీలను దగ్గరలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో కలిపి ఫౌండేషన్ స్కూళ్లుగా పిలుస్తారు.



# విస్తరణ కసరత్తు....

నెల్లూరు, ఆగస్టు 18, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మంత్రి వర్గ విస్తరణపై కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు కొందరు మంత్రులకు అప్పుడే సంకేతాలు వెళ్లాయని తెలుస్తోంది. కేబినెట్ నుంచి తప్పించే మంత్రులకు ముందుగానే తెలియపర్చాలని జగన్ అభిప్రాయపడుతన్నారట. ఎవరినీ పనితీరు ఆధారంగా పదవుల నుంచి తొలగించడం లేదని, కేవలం అందరికీ అవకాశం ఇవ్వాలన్న ఏకైక కారణంతోనే తప్పిస్తున్నామని మంత్రులతో జగన్ స్వయంగా చెప్పనున్నారని తెలిసింది. మరికొద్ది నెలల్లోనే జగన్ తన కేబినెట్ ను విస్తరించనున్నారు. ఇందుకోసం కసరత్తులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. దాదాపు 95 శాతం మంది మంత్రులను కేబినెట్ నుంచి తప్పించే అవకాశముంది. వీరిలో కొందరికి పార్టీ పదవులు అప్పగించాలని జగన్ యోచిస్తున్నారని తెలిసింది. పార్టీలో ముఖ్యమైన పదవులను ఎంపిక చేసిన వారికి ఇవ్వాలన్నది జగన్ నిర్ణయంగా ఉంది. దీంతో పాటు కొన్ని జిల్లాల బాధ్యతలను కూడా మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ఇచ్చే అవకాశముందట. జగన్ రెండేళ్ల క్రితమే చెప్పారు. ఈ మంత్రి వర్గం కేవలం రెండున్నరేళ్లు మాత్రమే ఉంటుందని, అందరికీ అవకాశం ఇవ్వడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దీంతో మంత్రి వర్గ విస్తరణ కోసం అనేక మంది ఆశలు పెట్టుకున్నారు. తమ సీనియారిటీ, సిన్సియారిటీని చూసి పదవి ఇస్తారని భావిస్తున్నారు. జగన్ కూడా అదే దిశగా ఆలోచన చేస్తున్నారని తెలిసింది. సామాజిక వర్గాలతో పాటు సిన్సియారిటీని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ముఖ్యంగా రాయలసీమలో జగన్ కు సామాజికపరంగా ఇబ్బంది తలెత్తుతుంది. ఇక్కడ రెడ్డి సామాజికవర్గం నేతలు ఆశావహుల్లో ఎక్కువగా ఉన్నారు. దీంతో వీరిలో కొంతమందికి పార్టీ పదవులు ఇవ్వాలని, జిల్లాల ఇన్ ఛార్జులుగా నియమించాలన్న యోచనలో జగన్ ఉన్నారని తెలుస్తోంది. మంత్రి పదవి ఏ కారణం చేత ఇవ్వలేకపోయారో కూడా దక్కని వారికి ఈసారి జగన్ ముందుగానే వివరించే అవకాశముందట. మొత్తం మీద జగన్ కేబినెట్ కూర్పు కసరత్తు మొదలయిందట.

# సామినేనికి లైన్ క్లియరేనా

విజయవాడ, ఆగస్టు 18, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సామాజికవర్గాల ఆధారంగా వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అనేక నియోజకవర్గాల్లో సామాజికవర్గాలకు అనుగుణంగా పదవులను పంపిణీ చేస్తున్నారు. ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తూనే ప్రధాన సామాజికవర్గాలను కూడా వైసీపీ అధినేత జగన్ విస్మరించడం లేదు. వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ఆయన పదవులను భర్తీ చేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రాతినిధ్యం వహిస్తున్న జగ్గయ్యపేటలోనూ అదే తీరుగా పదవుల భర్తీ జరిగింది. సామినేని ఉదయభాను పదేళ్ల తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009, 2014 ఎన్నికల్లో సామినేని ఉదయభాను జగ్గయ్యపేట నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ లో వైఎస్ కు వీరవిధేయుడిగా ఉన్న సామినేని ఉదయభాను కాపు సామాజికవర్గానికి చెందిన నేత. జగ్గయ్యపేటలో నందిగామ నియోజకవర్గం ప్రభావం కూడా ఉంటుంది. ఇక్కడ కమ్మ, కాపు సామాజిక వర్గానికి నిత్యం గొడవలే ఉంటాయి. రెండు సార్లు సామినేని ఉదయభాను ఓటమి పాలయింది కమ్మ సామాజికవర్గం ఓట్ల కారణంగానే. అందుకే ఆ సామాజికవర్గాన్ని మంచి చేసుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ నుంచి టీడీపీ తరుపున రెండుసార్లు విజయం సాధించిన శ్రీరాం తాతయ్య వైశ్య సామాజికవర్గానికి చెందిన నేత. ఆయనకు కమ్మ సామాజికవర్గం అండగా ఉండటంతోనే రెండు దఫాలుగా విజయం సాధ్యమయింది. సామినేని ఉదయభాను తన నియోజకవర్గంలో ఉన్న 32 వేల కమ్మ సామాజికవర్గం ఓట్లపై కన్నేశారు. అందుకే అదే సామాజికవర్గానికి చెందిన తన్నీరు నాగేశ్వరరావుకు పదవి ఇప్పించుకోగలిగారు. ఆయనకు డీసీసీబీ ఛైర్మన్ పదవి ఇవ్వడంతో కమ్మ సామాజికవర్గం ఓట్లు వైసీపీ వైపు మళ్లుతాయన్న అంచనాలో సామినేని ఉదయభాను ఉన్నారు. కానీ జిల్లాలో ఉన్న పరిస్థితుల కారణంగా ఆ సామాజికవర్గం సామినేని ఉదయభానుకు ఏ మేరకు మద్దతిస్తుందనేది చూడాల్సి ఉంది. మొత్తం మీద అన్ని సామాజికవర్గాలను మచ్చిక చేసుకుని వచ్చే ఎన్నికల్లోనూ విజయం సాధించాలనుకుంటున్న సామినేని ఉదయభాను ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.

# మధ్య తరగతి కోసం కాలనీలు

ఏలూరు, ఆగస్టు 18, (న్యూస్ పల్స్)ఒకరికి మంచి చేస్తే మరొకరకి అది చెడుగా కన్పిస్తుంది. ఎక్కడైనా ఇది సహజం. మంచి వెంటే చెడు వస్తూ ఉంటుంది. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి లక్ష కోట్లరూపాయలను అలవోకగా పేదప్రజలకు వివిధ పథకాల పేరిట పంచిపెట్టారు. దీంతో పేద వర్గాలు జగన్ కు సహజంగానే దగ్గరవుతాయి. కానీ అదే సమయంలో మధ్యతరగతి ప్రజల మనస్సు చివుక్కు మంటుంది. తమకు పథకాల అర్హత లేకపోవడంతో మధ్య తరగతి ప్రజలు జగన్ పాలన పట్ల అసంతృప్తిగా ఉన్నారు. వీరిని మంచిచేసుకునే ప్రయత్నంలో భాగంగానే జగన్ జగనన్న స్టార్ట్ టౌన్ షిప్ లను ప్రారంభించారు. మధ్యతరగతి ప్రజలకు సొంతిల్లు ఒక కల. దానిని సాకారం చేసేందుకు తక్కువ ధరలో ఇళ్ల స్థలాలను విక్రయించే ప్రక్రియకు జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే దాదాపు 30 లక్షల మంది పేదలకు ఉచితం ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిన జగన్ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలకు కూడా అందుబాటులో ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియను ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని ముఖ్య పట్టణాలు, నగరాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. పట్టణంలో దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ప్లాట్లను వేస్తారు. వీటిని లాటరీ పద్ధతుల్లో కేటాయిస్తారు. ఇందుకోసం ధరను కూడా నిర్ణయించి వాయిదాల పద్ధతులలో సొమ్ము చెల్లించే వెసులుబాటును జగన్ ప్రభుత్వం కల్పించింది. దీనికి సంబంధించి విధివిధానాలను రూపొందించారు. అక్కడ అన్ని సౌకర్యాలను ప్రభుత్వమే చేస్తుండటంతో స్థలానికి తక్కువ కాలంలో మంచి వాల్యూ వస్తుందని ప్రభుత్వం చెబుతుంది. దీంతో మధ్యతరగతి ప్రజలు వీటి పట్ల ఎక్కువగా మొగ్గు చూపే అవకాశముంది. ఒకసారి వాయిదా పద్ధతుల్లో చెల్లించిన వారంతా తిరిగి జగన్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారన్న వ్యూహం కూడా దాగి ఉంది. ఈ టౌన్ షిప్ ల ప్రక్రియ ఇప్పుడు ప్రారంభించినా మరో రెండు, మూడేళ్ల సమయం పడుతుంది కాబట్టి ఎన్నికల సమయంలో మధ్యతరగతి ప్రజలు కూడా తమవైపు మొగ్గుచూపుతారన్న అంచనాలో జగన్ ప్రభుత్వం ఉంది. మొత్తం మీద మధ్యతరగతి ఆశలను టౌన్ షిప్ ల ద్వారా తన ఓటు బ్యాంకుగా జగన్ మలచుకునే ప్రయత్నం చేస్తున్నారు

# రాజులపై సర్కార్ గురి

విజయనగరం, ఆగస్టు 18, (న్యూస్ పల్స్)విజయనగరం జిల్లా మీదనే వైసీపీ ఇపుడు గురి పెట్టింది. ఏకంగా మహారాజు పూసపాటి వంశీకుడు అయిన అశోక్ నే టార్గెట్ చేస్తోంది. ఇది చిన్న విషయం ఏ మాత్రం కాదు, తేడా కొడితే 2019లో విజయనగరంలో మొత్తం స్వీప్ చేసిన వైసీపీకి సీన్ రివర్స్ అవుతుంది. అందుకే జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. అశోక్ మీద యుద్ధం చేయాల్సిందే. ఇందులో రెండవ మాటకు తావు లేదు. మరి దానికి గానూ తగిన సాధనా సామగ్రిని సమకూర్చుకునే పనిలోనే వైసీపీ ఫుల్ బిజీగా ఉంది మరి.విజయనగరం జిల్లా రాజకీయాలు మొత్తం మారుతాయ్ అని అంటున్నారు. ఇక్కడ అటు అశోక్, ఇటు బొత్స ఏళ్ల తరబడి రాజకీయాలు చేస్తూ వచ్చారు. ఈ ఇద్దరూ బయటకు ఎన్ని అనుకున్నా కూడా లోపల తెలియని బంధం ఉంది అంటారు. ఇపుడు వైసీపీలో బొత్స సత్యనారాయణ మంత్రిగా ఉన్నా కూడా అశోక్ ని పొలిటికల్ గా అడ్డుకోవడంలేదు అన్న బాధ అయితే వైసీపీలో ఉంది. పైగా ఆయన తన రాజకీయాలనే చూసుకుంటున్నారు అన్న విమర్శలు కూడా ఉన్నాయి. దాంతో వైసీపీలో బొత్స హవాను తగ్గిస్తే జిల్లా రాజకీయాల్లో పట్టు చిక్కుతుందని భావిస్తున్నారుట. బొత్సను విస్తరణలో తప్పిస్తే కొత్త రాజకీయం స్టార్ట్ అవుతుంది అన్న చర్చ ఉంది.గత రెండేళ్లుగా మౌనంగా ఉన్న బొబ్బిలి రాజులు మళ్ళీ వైసీపీ వైపు రావడానికి రెడీ అంటున్నారు. వారికి బొత్స ఏకైక అడ్డంకి అని చెబుతారు. నాడు సుజయ క్రిష్ణ రంగారావు టీడీపీలో చేరిపోవడానికి కూడా బొత్స రాజకీయ ఆధిపత్యమే కారణం తప్ప జగన్ కాదని అంటారు. అంటే బొత్సను పక్కన పెడితే బొబ్బిలి రాజు వచ్చేందుకు ఓకే అన్న మాట. మరో వైపు చూస్తే బొబ్బిలి ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు మళ్ళీ గెలిచే చాన్స్ లేదు. ఈసారి జగన్ వేవ్ పెద్దగా ఉండదు, దాంతో సొంతంగా గెలిచే సత్తా ఆయనకు లేదు. దాంతో బొబ్బిలి రాజులను ముందే తెచ్చుకుంటే వారికే టికెట్ ఇచ్చి గెలిపించుకోవచ్చు అన్న మాట కూడా ఉందిట.బొబ్బిలి రాజులకు ఇటు పూసపాటి వారితో చారిత్రక వైరం ఉంది. మరో వైపు బొత్సతో రాజకీయ వైరం ఉంది. దాంతో పాటు వారికి సొంతంగా బలం ఉంది. ఈ క్రమంలో బొబ్బిలి రాజులను తిరిగి వైసీపీలోకి తెచ్చేందుకు రంగం సిద్ధం అవుతోంది అంటున్నారు. అన్నదమ్ములకు రెండు టికెట్లు ఇవ్వడంతో పాటు జిల్లాలో బొత్స ఫ్యామిలీ ఆధిపత్యానికి గండి కొడుతూ కొత్త వారికి చాన్స్ ఇవ్వాలన్నది వైసీపీ పెద్దల అలోచన. అంటే అటు అశోక్ తో పాటు ఇటు బొత్సను కూడా సైడ్ చేసే విధంగానే వైసీపీ జిల్లా రాజకీయాలు ఉంటాయని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఆధార్ కష్టాలకు అంతే లేదు

అనంతపురం ఆగస్టు 18, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఉరవకొండ నియోజకవర్గంలో ఆధార్ లో మార్పులు చేర్పులకు జనం పడుతున్న కష్టాలకు అంతేలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పథకానికి ఆధార్ అనుసంధానం చేయడంతో చంటి బిడ్డల తల్లులు, చిన్నపిల్లలు, వృద్ధుల వరకు ఆధార్ తప్పనిసరి అయింది. ఏ చిన్న తప్పు దొర్లిన పథకం అందని పరిస్థితి నెలకొంది. దీంతో చాలామంది సవరణ కోసం కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు.కళ్యాణదుర్గం పట్టణంలో గతంలో ఆంధ్ర బ్యాంక్, తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రాలు ఉండగా వాటిని కరోనా విజృంభన పలు కారణాలతో నిలిపివేశారు. అనంతపురం రోడ్లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదురుగా ఉన్న ఓ మీసేవ ఆధార్ కేంద్రం ఒకటే పని చేస్తుండటంతో దింతో నిత్యం వందలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలతో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అక్కడికి చేరుకుని నానా తంటాలు పడుతున్నారు. ఆధార్ లో మార్పులు చేర్పుల కోసం కేవలం దరఖాస్తులు పొందేందుకు వారంతా బారులుతీరారు. తల్లిదండ్రులు వరుసలో నిలుచుంటే పిల్లలు రోడ్డు పక్కన డివైడర్ లపై బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. ప్రత్యేక వాహనాల్లో కేంద్రానికి వస్తే దరఖాస్తులు దొరకడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం ఒకే కేంద్రం ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందారు. దరఖాస్తులు పోవడంలో విఫలమై సుమారు 400 మంది వరకు నిరాశతో వెనుదిరిగారు. సెప్టెంబర్ నెల ఆకరిలో వస్తే బయోమెట్రిక్ ఇస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. మీ సేవ కేంద్రం నిర్వాహకులు మాత్రం సందిట్లో సడేమియా అంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఆధార్ కేంద్రాలను ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.ఆధార్ కార్డ్ సవరణ చేసుకోవాలంటే మూడు నెలలకు పైగా పడుతుందని కళ్యాణదుర్గం ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టి మరికొన్ని సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు ఆధార్ కార్డు సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సదుపాయల లేమితో ప్రాథమిక పాఠశాల

విజయవాడ ఆగస్టు 18, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో నాడు - నేడు పథకం కింద పాఠశాలలు సుందరంగా ముస్తాబు అవుతుంటే కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లీ శాలివాహన కాలనీ మండల ప్రాథమిక పాఠశాలలో మాత్రం సదుపాయాలు లేమితో విద్యార్థులు , ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల భవనం బీటలు , పగుళ్ళు ఏర్పడ్డాయి. మరుగుదొడ్లు పాడైపోయాయి. కనీసం తలుపులు లేని పరిస్థితి. పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు , గడ్డి పెరిగి పాఠశాలలోకి పాములు సంచరించటం , గుడ్లు పెడుతున్నాయి. ఇదిలా ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు మూత్రశాలకు వెళ్లాలంటే అంతే సంగతులు.. విద్యార్థులు వాళ్ల ఇంటి వెళ్లి అవసరాలు తీర్చుకుని పరిస్థితి. పాఠశాల లో ఉండే ఉపాధ్యాయులు పరిస్థితి వర్ణనాతీతం. ఇద్దరు మహిళ ఉపాధ్యాయులు బయటకు చేప్పుకోలేని పరిస్థితి. నిత్యం కోతులు బెడదతో భయపడుతూ గడపడాల్సి వస్తోందని, పిల్లలను పాఠశాలకు పంపాలంటే భయమేస్తోందని, తల్లిదండ్రులు వాపోతున్నారు. కొంతమంది పాఠశాల అవరణ లో కూర్చుని పేకాట అడటం , మద్యం సేవిస్తూ అపరిశుభ్రం చేస్తున్నారని చెబుతున్నారు.

## సింహాచలంలో స్వర్ణ తులసీ దళార్చన

విశాఖపట్నం ఆగస్టు 18, (న్యూస్ పల్స్)విశాఖ వరాహలక్ష్మీనృసింహస్వామికి శాస్త్రోక్తంగా స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు.ఏకాదశి పర్వదినాన స్వర్ణ తులసీ దళార్చనను ఆర్జిత సేవ గా జరుపుతారు.ఇందులో భాగంగా అప్పన్న స్వామిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు జరిపాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరు లతో కల్యాణ మండపంలోని రజిత సింహాసనంపై ఉంచారు.ఆలయ అర్చకులు పుణ్యాహవచనా లతో స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించి, పరోక్షంగా, ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పారు. పూజాది కార్యక్రమాల అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రా లు, ప్రసాదాలను అందజేశారు.

# జీవోలను గోప్యంగా ఉంచాలనుకోవడం తప్పే

విజయవాడ,ఆగస్ట్18(: ప్రభుత్వం చేసే నిర్ణయాల పై దాపరికం ఎందుకని...ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై జనసేన నేత పోతిన వెంకట మహేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ జీవోలను గోప్యంగా ఉంచానుకోవడం సరికాదన్నారు. ఇది ప్రజలను మోసంచేయడవే అవుతుందన్నారు. అంటే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నామని జగన్ అంగీకరిస్తున్నారా అని ప్రశ్నించారు. వైఎస్ హయాంలోనే జీవోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టారు. తండ్రి పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన జగన్ ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. జగన్ నిర్ణయాలతో వైయస్ ఆత్మ క్షోభిస్తుందని వ్యాఖ్యానించారు. బతికున్న చెల్లికి ఎలాగూ న్యాయం చేయలేదని...వైఎస్‌ను కూడా జగన్ అవమానించడం బాధాకరమన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిర్ణయాలు చేస్తూ జీవోలు విడుదల చేస్తారని ఆయన తెలిపారు. వాటిని రహస్యంగా ఉంచారంటే... అవినీతిని ప్రోత్సహిస్తున్నారా అని నిలదీశారు. ఇది ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమన్నారు. సూట్ కేసుల కార్పొరేషన్‌లతో రాష్ట్రాన్ని దివాళా తీయించారని మండిపడ్డారు. మిషన్ ఏపీ, బిల్డ్ ఏపీ పేరుతో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెడతారా అని నిలదీశారు. ఆస్తులు అమ్మి పథకాల పేరుతో ఎలా పంచుతారని అడిగారు. విలువైన ఆస్తులను కొట్టేయడానికే ఈ అమ్మకాల నిర్ణయమని జనసేన నేత అన్నారు. బినామీ పేర్లతో దోచుకోవడానికే కొత్త కార్పొరేషన్‌లన్నారు. గతంలో సూట్ కేసు కంపెనీలు పెట్టి జగన్ కోట్లు దోచుకున్న వైనం అందరకీ గుర్తుందని తెలిపారు. మళ్లీ ఇప్పుడు అదే తరహా మోసాలకు జగన్ తెర లేపారని ఆరోపించారు. పోలీసు, కార్పొరేషన్, భూములు అమ్మకాల వివరాలు ఎందుకు బయటకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కాన్ఫడెన్షియల్ పేరుతో బ్లాంకు జీవోలు ఇస్తారా అని ఆయన అన్నారు. చీకటి రాజ్యం, దొంగల రాజ్యంగా మార్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సలహాదారుల పాలనే తప్ప, మంత్రుల పాలన సాగడం లేదని విమర్శించారు. జగన్‌కి అప్పులు చేయడమే తప్ప.. అభివృద్ధి వైపు ఆలోచన లేదన్నారు. అవినీతికి, దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా జగన్మోహన్ రెడ్డి నిలిచారన్నారు. పోలవరం వంటి ప్రాజెక్టుల పరిశీనలకు మంత్రులు వెళ్లే

**ఇది ప్రజలను వంచించడమే అతప్ప మరోటి కాదు**

**పారదర్శక పాలన చెప్పి చీకటి వ్యవహారాలు ఎందుకు**

**వైసిపిపై మండిపడ్డ జనసేన నేత పోతిన మహేశ్**

అవకాశం లేదని... సీఎం నియమించుకున్న సలహాదారులు పరిశీలిస్తారన్నారు. మంత్రులు పరిస్థితి ఉత్సవ మూర్తులు కన్నా అన్యాయంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇసుక, మైనింగ్, భూ వివాదాలు చూడటమే మంత్రులు, ఎమ్మెల్యేల పని అని పోతిన మహేష్ యెద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అభివృద్ధిపై మాత్రం మంత్రులకు పట్టదన్నారు. అందిన కాడికి దోచుకుని... ఇళ్లల్లో కూర్చోవడమే వీరి పని అని అన్నారు. మంత్రులకు కనీస విలువ లేకుండా పోయిందన్నారు. దళిత మహిళకి హోంమంత్రి ఇచ్చామని గొప్పలు చెప్పుకున్నారని...హోం మంత్రికి ఒక హోం గార్డు కూడా మర్యాద ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. పోలీసు శాఖను సజ్జల రామకృష్ణా రెడ్డి నడిపిస్తున్నారని అన్నారు. దళితులను జగన్ గౌరవిస్తున్నాడా... అవమానిస్తున్నాడా అని ప్రశ్నించారు. అమ్మాయిలపై దారుణాలు పెరిగిపోతున్నా.. ప్రభుత్వానికి పట్టదన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు రమ్యను ప్రేమోన్మాది హతమార్చాదని... నేరస్తులకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకం పెరిగిపోయిందని అన్నారు. బాధిత కుటుంబాలకు పది లక్షలు ఇస్తే సరిపోతుందా

అని ప్రశ్నించిన ఆయన గన్ కన్నా ముందు జగన్ వస్తారాని ప్రచారం చేశారని, ఆయన తాడేపల్లి ప్యాలెస్ గేటు కూడా దాటడం లేదని దుయ్యబట్టారు. జగన్‌పై పెట్టుకున్న నమ్మకం పోయిందని గెలిపించిన వారే గేలి చేస్తున్నారన్నారు. ప్రతి సమాచారం ప్రజలకు తెలియ చెప్పాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం అమలుపై కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. బ్లాంక్ జీవోలపై నాదెండ్ల మనోహర్ కూడా ప్రభుత్వాన్ని నిలదీశారని తెలిపారు. జనసేనాని పవన్ కళ్యాణ్‌పై ప్రజల్లో నమ్మకం పెరిగిందని చెప్పారు. వచ్చే ఎన్నికలలో జగన్ ఫ్యాన్ రెక్కలు విరగ్గొట్టి ప్రజలు బుద్ధి చెబుతారని పోతిన వెంకట మహేష్ హెచ్చరించారు.

# ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు రీ ఆర్డర్ కాపీ అందజేత

మందమర్రి. ఆగస్టు 18 సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఒక సంవత్సర కాలం పాటు ఉద్యోగ విరమణ కాలపరిమితి 60 నుండి 61సంవత్సరాలు పెంచడం జరిగింది. అందులో భాగంగా మార్చి 31 నుండి పదవి విరమణ పొందిన 55 మంది ఉద్యోగులకు బుధవారం శ్రీరాంపూర్ ఏరియా లోని ఆర్కే 6 గని పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గని కాలరి మేనేజర్ సంతోష్ కుమార్ గుర్తింపు సంఘం నాయకులతో కలిసి ఆఫీస్ రీ ఆర్డర్ కాఫిలను అందజేశారు.ఈ సందర్భంగా గాని మేనేజర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు సి. యం.డి శ్రీధర్, డైరెక్టర్స్ ఆదేశాలను అనుసరించి సింగరేణి సంస్థలో ఉద్యోగుల పదవీవిరమణ వయోపరిమితి 60 సంవత్సరాలనుండి 61 సంవత్సరాలకు పెంచడం జరిగిందని అన్నారు. ఇందులో భాగంగా ఆర్.కే.6 గనిలో మార్చి 31నుండి 55 మంది ఉద్యోగులు పదవి విరమణ పొందారని ఆయన తెలిపారు.పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఆఫీసు రీ ఆర్డర్స్ కాపీలను అందజేయడం జరిగిందని అన్నారు. మళ్లీ ఉద్యోగంలో చేరుతున్నందుకు సంతోషంగా

ఉందని ఈ సంవత్సర కాలం పాటు రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తిలో భాగస్వాములు కావాలని అని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సి.హెచ్.రాంచందర్ సెఫ్టీ ఆఫీసర్, కాదాసి శ్రీనివాస్ డిప్యూటి మేనేజర్, మహేశ్ ఇంజనీర్, గుర్తింపు సంఘం నాయకులు చిలుముల రాయమల్లు, ఫిట్ సెక్రెటరి వెంగళ కుమారస్వామి, అడ్డు శ్రీనివాస్, ఇప్ప భుమయ్య, కె.వెంకట్రాజం, కొత్తపల్లి సమ్మయ్య, నీలారపు చంద్రమౌలి, రాంటెంకి మల్లయ్య, కొత్తపల్లి బాలనర్సు, మనీధర్, జక్కెన సదానందం, బన్న వెంకటి, ఆఫీసు సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా అధికార పార్టీలో అంతర్గత కలహాలు

నెల్లూరు ఆగస్టు 18 నెల్లూరు జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలు, 2 పార్లమెంట్ స్థానాలు వైసీపీవే. కానీ అంతర్గత రాజకీయాలు మాత్రం అక్కడ పార్టీ పరువుని పదే పదే బజారున పడేస్తున్నాయి. ఎమ్మెల్యేలలో ఒకరంటే ఒకరికి పడటం లేదని అర్థమవుతోంది.ఇటీవలే సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ,ఈ పంచాయితీ కోసం జిల్లాకు వచ్చి వెళ్లారు. తాజాగా మరోసారి ఈ పోరు బజారునపడింది. మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ప్రస్తుత మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మధ్య కోల్డ్ వార్ ముదిరింది. వివాదం ఎక్కడ మొదలైంది..? .వైఎస్ఆర్ హయాంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన రామనారాయణ రెడ్డిని కాదని , అనిల్ కు సీఎం జగన్ మంత్రి పదవి ఇవ్వడంతోనే ఆ రెండు వర్గాల మధ్య గొడవ మొదలైంది. ఆనం కుటుంబ చలవతో అనిల్ రాజకీయ అరంగేట్రం చేశారని, ఇప్పుడు తమకే ఎదురు నిలబడ్డారని ఆ వర్గం అసంతృప్తితో ఉంది. ప్రస్తుతం అనిల్ నెల్లూరు సిటీకి ఎమ్మెల్యేగా ఉన్నారు.ఆనం రామనారాయణ రెడ్డి తనకు సంబంధం లేని వెంకటగిరి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే సిటీలో మాత్రం ఆనం వర్గానికి కూడా పట్టు ఉంది. ఓ దశలో ఈ గొడవలు ముదిరి. సిటీ నాది, సిటీలో రాజకీయం మాదేనంటూ ఆనం రామనారాయణ రెడ్డి హుంకరించారు. సిటీలో గడప గడపకు వెళ్తామని, తమ వర్గానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇప్పుడేమైంది..? .ప్రస్తుతం ఆనం, అనిల్ మధ్య మరో గొడవ మొదలైంది. నెల్లూరు పట్టణంలో కొత్తగా ఫ్లైఓవర్ కడుతున్నారు. దానికి సంబంధించి మినీ బైపాస్ రోడ్డులో మాజీ మంత్రి ఆనం వెంకటరెడ్డి

**రాష్ట్ర స్థాయి నాయకుల బుజ్జగింపులు**

విగ్రహాన్ని తొలగించాల్సి వచ్చింది. సరిగ్గా పిల్లర్ అక్కడికే రావడంతో విగ్రహాన్ని తొలగించేశారు సిబ్బంది. ఈ విషయంలో ఆనం రామనారాయణ రెడ్డి నొచ్చుకున్నారు. తన తండ్రి విగ్రహాన్ని తనకు తెలియకుండా తొలగించారని సన్నిహితుల వద్ద వాపోయారు. అనిల్ కు తాము రాజకీయం నేర్పిస్తే, ఇప్పుడు తమనే అవమానిస్తున్నారని బాధపడ్డారట.దానికి ప్రతిగా వెంకటగిరిలో చేపట్టే ఏ అభివృద్ధి పనుల్లోను శంకుస్థాపన ఫలకాలపై అనిల్ పేరు లేకుండా చేశారట. ఈ వ్యవహారం కలెక్టర్ వద్దకు వెళ్లింది. జిల్లా ఇన్ చార్జి మంత్రి బాలినేని కూడా ఆనంకు నచ్చజెప్పాలని చూసినా ఫలితం లేదు. చివరకు కొన్నిచోట్ల మంత్రి అనిల్ పేరుని పేపర్ పై రాసి, శిలా ఫలకాలపై అతికించడం విశేషం. రగులుతున్న రాజకీయాలు.. .ఇటీవల గ్రావెల్ తవ్వకాల వ్యవహారంలో సాక్షాత్తూ జిల్లా నివాసి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిపై పోలీసులు కేసు పెట్టడం సంచలనంగా మారింది. అధికార పార్టీ ఎంపీపై కేసు ఎందుకు పెట్టారని ఆరా తీస్తే, జలవనరుల శాఖ సిబ్బంది పాత్ర అందులో ఉందని తేలింది. దీంతో అనిల్ పై ప్రతిపక్షం కూడా విమర్శలు చేసింది.ఈ పంచాయితీ కోసమే ఇటీవల సజ్జల రామకృష్ణారెడ్డి నెల్లూరు వచ్చి వెళ్లారు. జిల్లా ఇన్ చార్జి మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డికి కూడా ఈ వ్యవహారాలన్నీ తలనొప్పిగానే మారాయి. కొత్తగా ఆనం తన తండ్రి ఆనం వెంకట్ రెడ్డి విగ్రహం విషయంలో ఆగ్రహావేశాలు మొదలయ్యాయి.

# ప్రజా సంక్షేమమే ఆరోగ్య రక్షా సమితి లక్ష్యం

నెల్లూరు ప్రజా సంక్షేమమే ఉత్తమ లక్ష్యం గా ఆరోగ్య రక్షా సమితి ఏర్పాటు చేయబడింది అని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి వి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ నందు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ వైపరీత్యాల ఈ నేపథ్యంలో కంటికి కనిపించని కరోనా వైరస్ ను నియంత్రించడం, వ్యాధి సోకిన వారికి వైద్య సేవలు అందించడం, కరోనా వైరస్ బాధిత కుటుంబాలలో మనోధైర్యం నింపడం కోసం అనేక స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆరోగ్య రక్షా సమితి సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం యొక్క సూచనలు సలహాల మేరకు కోవిడ్ 19 నియంత్రణ కోసం పనిచేస్తున్న వివిధ సంస్థలు, వ్యక్తుల తో కలిసి పని చేసేందుకు ఆరోగ్య రక్షా సమితి సిద్ధంగా ఉందన్నారు. కరోనా వైరస్ మొదటి దశ కంటే రెండవ దశ లో అనేకమంది ఆప్తులను, బంధువులను, మిత్రులను కోల్పోవడం జరిగిందన్నారు. ప్రస్తుత 3వ దశలో పిల్లలు అధికశాతం కరోనా వైరస్ బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్న విషయం తెలిసిందే అన్నారు. ఈ క్రమంలో మన ఆరోగ్యం, సామాజిక బాధ్యత అనే విధానంతో ఆరోగ్య రక్షా సమితి ఆధ్వర్యంలో ప్రతి గ్రామానికి 10మందితో కూడిన ఆరోగ్య రక్షా సమితి ఐక్యత యూనిటీ లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఏర్పాటు చేయనున్న ఆరోగ్య రక్షా సమితిలో తల్లులను, గ్రామ పెద్దలను, ఆశా వర్కర్ లను, సామాజిక సేవా సంస్థలను, వైద్యులను భాగస్వాములు చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థినీ ,విద్యార్థులు, తల్లులు, వయోవృద్ధులు లక్ష్యంగా చేసుకుని వారందరికీ వ్యక్తిగత గృహ పరిశుభ్రతలు మరియు వ్యాక్సిన్ ప్రాధాన్యత గురించి గ్రామాల వారీగా అవగాహన

**సమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి వి సుబ్రహ్మణ్యం**

కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత జాగ్రత్తలు లో భాగంగా మాస్కులు ధరించి విధానం, పోషకాహారం, వ్యాయామం, రోగనిరోధక శక్తిని పెంచే మందులు, ఔషధాలు, కషాయాలను తయారు చేయు పద్ధతి గురించి ప్రజలకు తెలియజేయడం తదితర కరోనా వైరస్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు ఆరోగ్య రక్షా సమితి చేపట్టేందుకు తగిన ప్రణాళిక నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమాలలో భాగస్వామ్యం అయ్యేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, మరియు సేవా దృక్పథం కలిగిన వ్యక్తులను ఆహ్వానిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లో సమితి జిల్లా కన్వీనర్ ముక్కాల వ్యాస్ ప్రసాద్, కో కన్వీనర్ బొందల మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాలు పెంచాలి మహాప్రభో..

పి.గన్నవరం ఈ కెవైసి వేలిముద్రలు నమోదు చేయించుకోకపోతే రేషన్ బియ్యం కట్ అని అధికారులు ప్రకటించడంతో పిల్లా పాపలతో పోస్టాఫీసులు, మీసేవ కేంద్రాలు, బ్యాంకుల వద్ద వందలాది మంది క్యూ కడుతున్నారు. కరోనా థర్డ్ వేవ్ ప్రభావం పిల్లలపై ఎక్కువగా ఉంటుందని ప్రచారం జరుగుతున్న పరిస్థితులలో వందలాది మంది పిల్లలు కేవలం మాస్కులు మాత్రమే ధరించి క్యూలైన్లలో నిలబడటం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా మండలానికి ఒకటి లేదా రెండు మాత్రవే ఆధార్ కేంద్రాలు ఉన్నాయి కెవైసి చేయించుకోవలిసిన చిన్నారులు, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఆధార్ సెంటర్లు పెంచాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

# సబ్బవరం లో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదు

**స్పందించిన జిల్లా యంత్రంగాం??సబ్బవరం లో ఇంటింటి సర్వే**

విశాఖపట్నం ఆగస్టు 18, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లా సబ్బవరం మండల కేంద్రంలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ఒక బాలుడికి డెంగ్యూ పాజిటివ్గా నిర్ధారణ అయింది. దీంతో స్పందించిన జిల్లా మలేరియా అధికారి మణి మంగళవారం సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, మలేరియా విభాగానికి చెందిన ఆరోగ్య కార్యకర్తలతో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రతి ఇంటికి తిరిగి నిత్యం ప్రజలు వాడుకునే మంచినీటి లోనే డెంగ్యూ జ్వరాలు కారకమైన దోమలు గుడ్లు పెట్టి మారుతాయని ఆమె వివరించారు. కాబట్టి గృహిణులు తమ తమ ఇళ్లలోనూ, పెరట్లో ను, నీటిని నిల్వ లేకుండా ప్రతి మూడు రోజులకు ఒకసారి చూసుకుని పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. లార్వా దశలోనే డెంగ్యూ వ్యాప్తి చేసే దోమలను నివారించే గలిగితే తేలిగ్గా ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా రక్షించుకునే వీలుంటుందని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు పట్టణ ప్రాంతాలు, నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు డెంగ్యూ జ్వరాలు రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అందుకోసం ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి సబ్బవరం లో ఓ కేసు డెంగ్యూ పాజిటివ్గా నమోదు కావడంతో తమ వైద్య ఆరోగ్య సిబ్బంది తో కలిపి ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సర్వే కార్యక్రమంలో సబ్బవరం పి హెచ్ సి హెచ్ఎం మేల్‌బి పైడయ్య , అనకాపల్లి పి ఎస్ సి మలేరియా విభాగం ఉద్యోగి సురేష్, ఇతర ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఛలాన్లా మార్ఫింగ్ తో నాలుగు లక్షలు స్వాహా

నర్సీపట్నం ఆగస్టు 18, (న్యూస్ పల్స్)సంచల సంసృష్టించిన రిజిస్ట్రేషన్ నకిలీ చలానాలు వ్యవహారం లో మరో 29 చలానాలు మార్ఫింగ్ చేసి నాలుగు లక్షల 15 వేల 639 రూపాయలను డాక్యుమెంట్ రైటర్ లక్కోజు జగదీష్ స్వాహా చేశారని ఇంచార్జ్ రిజిస్టర్ శ్రీకాంత్ తెలిపారు. మొత్తం ఏడు లక్షల 91 వేల 965 రూపా యలను జగదీష్ స్వాహా చేశారని అతన్నుంచి ఐదు లక్షల రూపాయలను రికవరీ చేసామని పేర్కొన్నారు. నర్సీపట్నం రిజిస్ట్రేషన్ ఆఫీ సులో పూర్తిస్థాయిలో అన్ని చలనాలను తనిఖీ చేశామని పేర్కొన్నారు. 2018లో ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ ద్వారా చలానాలు కట్టడానికి అవకాశం ఇచ్చిందని దీనిని ఆసరాగా చేసుకునిజగదీష్ తప్పుడు పనులకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ “కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో అని రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లోనూ జరిగిన తనిఖీల్లో నర్సీపట్న లో ఈ విషయం బయటపడిందని కంప్యూటర్ నాలెడ్జ్ గాహన ఉన్న జగదీష్ తప్పుడు పని చేశాడని పేర్కొన్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న జగదీష్ జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన పూర్తి స్థాయి తనిఖీలలో చిట్టా మొత్తం బయటకు వచ్చిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు చేస్తున్నచలానాల విధానంలో లోపాలు సరి చేసి మార్పులు చేసిందని దీనివల్ల భవిష్యత్తులో ఎటువంటి అవకతవకలకు పాల్పడే అవకాశం ఉండదని పేర్కొన్నారు. సొమ్ము రికవరీ చేసినప్పటికీ పోలీస్ కేస్ ఉంటుందని ఆయన తెలిపారు. కార్యాలయంలో ఆరోపణలు ఎదుర్కొన్న అవుట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగిని విధుల నుంచి తప్పించినట్లు ఆయన తెలిపారు. అలాగే బుధవారం నుంచి యధావిధిగా నర్సీపట్నం రిజిస్ట్రేషన్ ఆఫీస్ క్రయవిక్రయ లావాదేవీలు కొనసాగుతాయని ఇన్చార్జి రిజిస్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు.

## మునిసిపాలిటీ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

నెల్లూరు నెల్లూరు నగరపాలక సంస్థా అవినీతికి అడ్డాగ మారిందని విమర్సలు వెల్లువెత్తుతున్నాయి..ఉన్నాతాధికారుల మొదలు గుమస్తాల వరకు సమస్తం డబ్బు ఇవ్వనిదే పని కావడం లేదని నెల్లూరు పబ్లిక్ మండిపడుతున్న వేళ ఎసిబి దాడులు జరుగుతున్నాయి. నెల్లూరు నగర కార్పొరేషన్లో ఏసీబీ అధికారుల తనిఖీలు కలకలం రేపాయి. ఆందోళనలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు జడుసుకోంటున్నారు. తాజాగా నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల రాకతో కలకలం మొదలైంది. ఏసీబీ అధికారులకు పలు ఫిర్యాదులు అందడంతో పక్కా సమాచారంతో నెల్లూరు కార్పొరేషన్ కు చేరుకున్న ఏసీబీ అధికారులు కార్పొరేషన్ లోని టౌన్ ప్లానింగ్ రెవిన్యూ విభాగాల వద్దకు చేరుకున్నారు. అక్కడ పలు రికార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. ఈ విభాగంలో సిబ్బంది వద్ద ఏమైనా నగదు ఉందా అన్న విషయాలను కూడా పరిశీలించారు. ప్రస్తుతం రికార్డుల తనిఖీ ముమ్మరంగా జరుగుతోంది. పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

## ఈ కేవైసీ నమోదుకై చిన్నారులు తల్లిదండ్రులు ఇక్కట్లు

శ్రీకాళహస్తి చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం సత్యవేడు నియోజకవర్గం మండలాల్లోని ప్రజలు తమ చిన్నారులకు రేషన్ కావాలన్నా ప్రభుత్వ పథకాలు అందాలన్న ఈకేవైసీ చేసుకోండి అంటూ సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఆదేశించడంతో, తమ చిన్నారులకు పట్టెడన్నం కోసం రేషన్ బియ్యంకై ప్రభుత్వ పథకాలు తమ చిన్నారులకు అందించాలనే ఆశతో నిరుపేదలైన తల్లితండ్రులు,పింఛన్ లతో జీవనాధారం సాగించే అవ్వ తాత తమకు పింఛన్ లు కావాలి అని ఆశతో ఈకేవైసీ కై శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయంవద్ద ఈ కేవైసీ నమోదుకై రాత్రి12:00 నుంచి పడిగాపులుకాస్తూ తమ పిల్లలకు ఈ పోస్ట్ ఆఫీస్ వద్ద ఆహార పానీయాలు తినిపించుకుంటూ ఇక్కట్లుపడుతున్నమని చిన్నారుల తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఓపక్క కరోనా మహమ్మారి విజృంభిస్తుందని ప్రభుత్వమే పదేపదే ప్రచారం మాధ్యమాలలో ప్రచారంచేస్తూ ప్రజలసామాజిక దూరం పాటించండి అంటూ చెబుతున్న సచివాలయంవ్యవస్థ ,నేడు ఈకేవైసీ నమోదు చేసుకోండి అంటూ వారు చేతులెత్తేయడంతో పోస్ట్ఆఫీస్ వద్ద గుంపులు గుంపులుగాచేరి తమ చిన్నారులు ఈ తొక్కిసలాటలో ఇబ్బంది పడుతున్నరని,ఈ ఒక్క పోస్ట్ ఆఫీస్ లోనే ఈ కేవైసీ చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారి వారి సచివాలయం పరిధిలో ఈకేవైసీ కేంద్రాలు ఏర్పాటుచేస్తే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవంటున్నారు

# విద్యార్థులకు జగన్న విద్య కానుక కిట్లు పంపిణీ

కౌతాళం ఆగస్టు 18, (( విభారె) పతి విద్యార్థి చదువు ఉంటేనే ప్రయోజకులు అవుతారని అందరికీ చదువు అందలనే ఉద్దేశ్యం తోనే ముఖ్యమంత్రి పనిచేస్తున్నరాని ఉన్నత పాఠశాల వడ్డే రాముడు పేర్కొన్నారు.బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల చైర్మన్ వడ్డే రాముడు అధ్యక్షతన జగనన్న విద్యా కానుక కార్యక్రమం నిర్వహించారు. కౌతాళం మండల కేంద్రం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు జగన్న విద్యా కానుక కిట్లను ఉన్నత పాఠశాల చైర్మన్ వడ్డే రాముడు,సర్పంచ్ పాల్ దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఎవ్వరు చదువుకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాభివద్ధికి ఎంతో కృషి చేస్తోందని, ప్రతి సంవత్సరం రెండు జతల బట్టలు,షూస్, పుస్తకాలు పంపిణి చేస్తున్నారు. అదేవిధంగా పిల్లలకు బళ్ళో పెట్టె మధ్యాహ్న భోజనంలో కూడా మార్పులు చేసి మంచి రుచికరమైన భోజనం పెడుతున్నారని, విద్యార్థులకు అమ్మ ఓడి రూపంలో సంవత్సరనికి పదిహేను వేల రూపాయలు అందజేస్తున్నారు. ఏ ప్రభుత్వ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేయడంతో పాటుగా చదువు కోవాలని ఉన్న చదివించే ఆర్థిక స్తోమత లేక చాలామంది చదువు మానేసి కూలీ పనులకు వెళ్తున్నరని, అటువంటి వాళ్ళు చదువు కునేందుకు వైసిపి ప్రభుత్వం విద్యాభివద్ధికి ఎంతో కృషి చేస్తోందని, ప్రవేట్ స్కూలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్య పట్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు నిదర్శనమని, ప్రతి విద్యార్థీ విద్యా కానుకను సద్వినియోగం చేసుకోవాలని,వడ్డే రాముడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అవతారం, సర్పంచ్ పాల్ దినకర్ ,తిక్కయ్య, బుజ్జి స్వామి, మహానంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కేంద్రీకృత అవినీతి

విజయవాడ ఆగస్టు 18, (( విభారె) రాష్ట్రంలో సెంట్రలైజ్డ్ అవినీతి జరుగుతోందని బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ 50 ఏళ్లలో ఇలాంటి అవినీతి ఎక్కడా చూడలేదన్నారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తే పోలీస్ కేసులు పెట్టేస్తున్నారని మండపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉండేదని...ఇప్పుడు సీఐడీ పటిష్టంగా ఉందని అన్నారు. రాష్ట్రానికి క్యాపిటల్ ఎక్కడ అని చెప్పుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పోలీస్ వ్యవస్థ ప్రతిపక్షాలను అణగదొక్కడానికే పని చేస్తోందని విమర్శించారు. 2008 లో వైఎస్సార్ తెచ్చిన ఆన్‌లైన్ జీవోల విధానాన్ని జగన్ నిలిపివేశారన్నారు. రహస్య పాలన నడపాలి అని ప్రభుత్వం భావిస్తుందని మండిపడ్డారు. ప్రజలకు డబ్బులు పంచుతున్నాం అనుకుంటే సరిపోదని...వాళ్ళు అన్ని అనుమనిస్తున్నారని తెలిపారు. నేతల హౌస్ అరెస్టలు పరిపాటిగా మారాయని కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు.

# వైకాపా వర్గాల ఘర్షణ

గుంటూరు గుంటూరు హోంమంత్రి సుచరిత పర్యటనలో వైసీపీ వర్గ విభేదాలు బయటపడ్డాయి. బుధవారం నాడు మంత్రి సుచరిత పలు కార్యక్రమాల్లో భాగంగా గులజాల నియోజకవర్గానికి వెళ్లారు. సుచరిత సమక్షంలోనే రెండు వర్గాలు బాహబాహీ దాడులకు దిగారు. ఇరు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు.

# క్రిస్టియన్ సమాజానికి తన వంతు కృషి చేస్తాను

**ఏ పి రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ**

డోన్ ఆగస్టు 18, (( విభారె) క్రిస్టియన్ సమాజానికి త వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు, స్థానికడోన్ పట్టణంలో గల క్రిస్టియన్ కమిటీ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిష్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బోల్లవరపు జాన్ వెస్లీ విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సమాజానికి తన వంతుగా రాజ్యాంగ బద్ధంగా చట్ట పరిధికి లోబడి చేయవలసిన మంచి పనులు చేస్తానని క్రైస్తవులకు సంబంధించిన ఏ సమస్య అయినా తన దృష్టికి నేరుగా తీసుకురావచ్చని ఏ సమయంలోనైనా తనను కలగవచ్చని తెలియజేశారు తనపై నమ్మకంతో క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో రాయలసీమ బైబిల్ మిషన్ డైరెక్టర్ రెవ.బందెల రాజు, డోన్ వైఎస్ఆర్సిపి 17వ వార్డు కౌన్సిలర్ నాగేంద్ర మూర్తి ,16 వార్డు వైఎస్ఆర్సిపి కార్యకర్త భాస్కర్, మరియు డోన్ మండల పాస్టర్ ఫెలోషిప్ సమైక్య క్రైస్తవ సంఘం జాయింట్ సెక్రెటరీ సాల్మన్ రాజు , ట్రెజరర్ ఇసాక్ , జాయింట్ సెక్రటరీ జీవన్, పెద్దలు మరియు సంఘ సభ్యులు , పాల్గొన్నారు

# డ్రైఫ్లవర్ టెక్నాలజితో అకర్షణీయ ఉత్పత్తులు

**- టిటిడి ఈవో**

తిరుమల ఆగస్టు 18, (( విభారె) డ్రైఫ్లవర్ టెక్నాలజి ద్వారా టిటిడి అవసరాలకు తగిన ఉత్పత్తులు తయారు చేసి ఇవ్వడానికి ముందుకు రావాలని టిటిడి ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి అధికారులను కోరారు. టిటిడి పరిపాలన భవనంలోని తన ఛాంబర్‌లో బుధవారం ఈవో డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ జానకిరామ్, పశువైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పద్మానాభరెడ్డి, ఉద్యాన విశ్వవిద్యాలయం డైరెక్టర్ అఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ శ్రీనివాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ డ్రైఫ్లవర్ టెక్నాలజి ద్వారా బొకేలు, ల్యామినేటెడ్ ఫోటోలు, పేపర్ వెయిట్స్ తదితర ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం ఉన్నడాక్టర్ వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ముందుకు వస్తే తిరుపతిలో స్థలం కేటాయిస్తామని చెప్పారు. ఇందులో ఉత్పత్తులకు అవసరమయ్యే యంత్రాలు, సౌకర్యాలతో పాటు, పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చునని సూచించారు. ఐదు సంవత్సరాల వరకు ఈ కేంద్రాన్ని నిర్వహించుకుని తరువాత టిటిడికి అప్పగించే ప్రతిపాదన పరిశీలించాలన్నారు. డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయం డ్రైఫ్లవర్ టెక్నాలజి ద్వారా ఇప్పటికే రోజ్‌టీ, లిల్లీ టీ, లెమన్ గ్రాస్ మ్యారిగోల్డ్ టీ, హైబిస్కస్ టీ, సోపులు, బాడీ కెర్ ఉత్పత్తులు, ఫేషియల్ క్రీములు, మాస్క్‌లు, స్ప్రే లాంటి అనేక ఉత్పత్తులు స్థానికంగానే తయారు చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుమల, ఆగస్టు 18 తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల పవిత్రోత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుంగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేస్తారు. అనంతరం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఈవో ఏ.వి.ధర్మారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో రమేష్ బాబు, పేష్కార్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు-మల్లవరం ఆరు లైన్ల రహదారి పూర్తికి సహకరించండి ? జిల్లా కలెక్టర్

తిరుపతి, ,ఆగష్టు 18 చిత్తూరు (కుక్కలపల్లి) ? సి. మల్లవరంఆరు లైన్ల 140 నెంబరు జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తి చేయడానికి సహకరించాలని, పనులకు ఆటంకం లేకుండా రైతుల భూములు, ,ఇళ్లస్థలాల సమస్యలు రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.రాజాబాబు అన్నారు. బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆరు లైన్ల రహదారిలో కోర్టులను ఆశ్రయించిన రైతులతో , గృహాలు కోల్పోతున్న వారితో జిల్లా కలెక్టర్ , తిరుపతి ఆర్. డి. ఓ. కనకనరసా రెడ్డి , సంబంధిత తహసీల్దార్ల సమక్షంలో సమస్యలపై, పరిహారంపై పెండింగ్ లో వున్న ఆయా ప్రదేశాలలో చర్చించారు జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిహారం విషయంలో ప్రభుత్వ పరంగా మీకు న్యాయం జరిగేలా చూస్తానని, వ్రాత పూర్వకంగా సమస్యలు తెలపాలని, పరిష్కరించడానికి సిద్దంగా వున్నామని అన్నారు. ఇప్పటికే రూ.1800 కోట్లతో నిర్మిస్తున్న జాతీయ రహదారి, 90% పైగా పూర్తి అయిన రహదారిలో , చిన్న సమస్యలతో 61 కి.మీ.లలో కేవలం 10 కి.మీ లు రహదారి నిర్మాణం ఆలస్యం కావడం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భావ్యంకాదని అన్నారు. కోవిడ్ కారణంతో ఇప్పటికే చాలా ఆలస్యం కావడం, కోర్టు కేసులు వల్ల పనులు ఆలస్యమైందని తెలిపారు. చంద్రగిరి మండలం కొంగరవారిపల్లి, బొడింబాయి వద్ద కోర్టులో కేసులు వేసి వున్నరైతులతో మాట్లాడటం, కృష్ణాపురం వద్ద ఇళ్ళు కట్టుకున్నట్టుకుంటున్న వారి కోరిన మేరకు విద్యుత్ లైన్లు ఏర్పాటు , పనపాకం వద్ద రైస్ మిల్లు వారి ఆలస్యంలేకుండా కల్ రోడ్ పల్లి వద్ద ఇంటి స్థలాల విషయం, పరిష్కారానికి జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చి జాతీయ రహదారికి సహకరించాలని కోరారు. గతంలో నెలలో జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ రైతులు కోరిన మేరకు జాతీయ రహదారికి ఆనుకొని వున్న రవణప్పగారిపల్లి వద్ద స్వర్ణముఖి కాలువ ఫ్లడ్ వాల్ నిర్మాణం పరిశీలించారు. రైతుల భూములు వర్షాలవల్ల భూమి కోతలకు గురికాకుండా జాగ్రత్తతో , న్యాణ్యతతో ఫ్లడ్ వాల్ జరగాలని ఆదేశించారు.

# బిటెక్ విద్యార్థిని రమ్య కు శ్రీసాయి గ్లోబల్ కంప్యూటర్స్ విద్యార్థుల ఘన నివాళి

డోన్ ఆగస్టు 18, (( విభారె) బిటెక్ విద్యార్థిని రమ్య కు శ్రీ సాయి గ్లోబల్ కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ అకడమి విద్యార్థులందరూ నివాళులు అర్పించారు, స్థానిక శ్రీసాయి గ్లోబల్ కంప్యూటర్స్ మరియు ఎడ్యుకేషన్ అకాడమి లో బీటెక్ విద్యార్థిని రమ్యకు విద్యార్థులు కోవతులతో నివాళులు అర్పించారు,పట్టణంలో శ్రీ సాయి గ్లోబల్ కంప్యూటర్ అండ్ అదుకేషల్ అకాడమీ అధినేత ఇమిడి లక్ష్మణ్ సాయి మాట్లాడుతూ. దేశమంతటా స్వాతంత్ర వేడుకలు జరుపుకుంటున్న సందర్భంలో బీటెక్ చదువుతున్న ఒక విద్యార్థిని రమ్యను పట్టపగలే నడిరోడ్డుపై జనమంతా చూస్తుండగానే శశి అనే యువకుడు ఆ అమ్మాయి పై విచక్షణారహితంగా దాడి చేసి కత్తితో పొడిచి హతమార్చడం చాలా బాధాకరం. అసలు ఈ రాష్ట్రంలో మహిళలకు సరైన రక్షణ అనేది ఉందా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నేను ప్రశ్నిస్తున్నాను, మన దేశానికి స్వాతంత్రం వచ్చిన రోజున పట్టపగలే నడిరోడ్డుపై దళిత విద్యార్థిని హత్యకు గురికావడం చాలా బాధాకరం,ఇదేవిధంగా కర్నూలు జిల్లా కర్నూల్ లోని ప్రీతిభాయ్ , గోనెగండ్ల గ్రామానికి చెందిన హాజీరా , వెల్దుర్తి లో మనసా, ధర్మవరం లో స్నేహాలత ఇంకా ఎంతో మంది అమ్మాయిలు అత్యాచారానికి గురై సంవత్సరాలు గడుస్తున్నా వారికి ఎలాంటి న్యాయం జరగకపోవడం సిగ్గుచేటు అని అన్నారు,అసలు ఆడవాళ్లపై అత్యంత దారుణంగా ఇలాంటి అత్యాచారాలు జరుగుతూ ఉంటే మన దేశానికి స్వాతంత్రం వచ్చిందా? అన్న అనుమానం వస్తుంది. అందుకే మహిళలకు రక్షణ కల్పించడంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు, అలాగే ఇలాంటి నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు,అసలు ఇలాంటి నేరాలు చేసే వారికి ఎటువంటి శిక్షలు సరిపోవు వారికి ఉరిశిక్షే సరైన మార్గం అనీ చనిపోయిన విద్యార్థిని రమ్య కు ఇన్స్టిట్యూట్ విద్యార్థులు సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ వెంకటేష్, ఉపాధ్యక్షుడు మోహన్ గౌడ్, అర్జున్,విద్యార్థులు పాల్గొన్నారు..

# అప్పన్న గోశాలను పరిశీలించిన శ్రీనివాసనంద సరస్వతి

విశాఖపట్నం ఆగస్టు 18, (( విభారె) విశాఖ సింహాచలం పాత గోశాల ను ఆంధ్ర ప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాస నంద సరస్వతి సందర్శించారు.ఇటీవల కాలంలో లేగ దూడలు మృత్యువాత పై ఆరా తీశారు. గోశాలలో కనీస సదుపాయాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.మందుబాబులకు అడ్డాగా మారిన గోశాలలో మద్యం బాటిళ్ల దర్శనమివ్వడంతో

ఆగ్రహం వ్యక్తం చేశారు.సింహగిరిపై రోజుకో దుస్థితి, అపచారాలు జరుగుతున్న సిబ్బంది గాలికొదిలేశారని,గోసాల నిర్వాహకుడు వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని శ్రీనివాస నంద సరస్వతి స్వామి డిమాండ్ చేశారు.స్వామి వారి ఆస్తులను భూములను బంగారం ఆభరణాలను కాపాడలేని ఈవో సూర్య కళ ను సస్పెండ్ చేయాలన్నా రు.రాష్ట్రంలో దేవాలయాల్లో జరుగుతున్న అవినీతి ,అపచారాలు ను కాపాడలేని రాష్ట్రమంత్రి వెల్లంపల్లి శ్రీనివాన్ రాజీనామా చేయాలని స్వామిజీ డిమాండ్ చేశారు.గోశాలను కాపాడలేని సమక్షంలో హిందువులకు ధార్మిక సంఘాలకు అప్పజెప్పాలని స్వామిజీ ఎద్దేవా చేశారు.

# ప్రేమలో పడదు... పడేలా చేస్తుంది!



"మీ భవిష్యత్ ప్రణాళికలు ఏంటి? ఎక్కువ ఆలోచించవద్దు! ఎందుకంటే... త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో 'ప్లాన్ ఎ ప్లాన్ బి' వస్తుంది" అని తమన్నా అంటున్నారు.

త్వరలో మ్యాచ్‌మేకర్ (పెళ్లి సంబంధాలు కుదిర్చే వ్యక్తి)గా వీక్షకుల ముందుకు ఆమె రానున్నారు. రితేశ్ దేశ్‌ముఖ్‌కు జంటగా ఆమె నటించిన 'ప్లాన్ ఎ ప్లాన్ బి'. పూనమ్ థిల్లాన్,కుశాకపిల ప్రధాన పాత్రధారులు. సోమవారం రితేశ్, తమన్నా లుక్స్ విడుదల చేశారు. రితేశ్‌కు తొలి ఓటీటీ చిత్రమిది. 'ఎలెవెంత్ అవర్', 'నవంబర్ స్టోరీ' వెబ్ సిరీస్‌లలో తమన్నా నటించిన సంగతి తెలిసిందే. 'ప్లాన్ ఎ ప్లాన్ బి'లో పోషించిన పాత్ర గురించి తమన్నా మాట్లాడుతూ "ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. కథ నుంచి పాత్ర వరకూ ప్రతిదీ నన్ను ఆకట్టుకుంది. ఇందులో మ్యాచ్‌మేకర్ పాత్రలో నటించా. ఇతరులు ప్రేమలో పడేలా చేసే ఆ అమ్మాయి, తాను మాత్రం ప్రేమలో పడాలని కోరుకోదు. ఆమె జీవితంలో ఏం జరిగిందనేది సినిమా చూసి తెలుసుకోవాలి. నా పాత్ర, సినిమా ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి" అని చెప్పారు. ఈ చిత్రానికి 'వీరే ది వెడ్డింగ్' ఫేమ్ శశాంక ఘోష్ దర్శకత్వం వహించారు.

# ప్రతి గాయకుడిలోనూ ఓ నటుడు ఉంటాడు!




"ప్రతి గాయకుడిలోనూ ఓ నటుడు ఉంటాడు. నాలుగు గోడల మధ్య పాడేటప్పుడు హీరోను ఊహించుకుంటూ పాడతాడు. అప్పుడే పాట బావుంటుంది. ఆ గాయకుడికి నటుడిగా అవకాశాలు దొరికినప్పుడు ప్రేక్షకుల ముందుకొస్తాడు. పేరు తెచ్చుకుంటాడు" అని నాగూర్ బాబు అన్నారు. పదమూడు భాషల్లో సుమారు పాతికవేల పాటలు పాడిన ఆయన, నటుడిగానూ తెరపైకి వస్తుంటారు. నాగూర్ బాబు నటించిన తాజా చిత్రం 'క్రేజీ అంకుల్స్'. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకొస్తోంది. నాగూర్ బాబు చెప్పిన సంగతులు...బాల్యంలో సంగీతంలో శిక్షణ తీసుకున్నాను. అలాగే, నటుడిగానూ చేశా. 'రంగూన్ రౌడీ'లో చిన్నప్పటి కృష్ణంరాజుగా, 'నీడ'లో కృష్ణగారి అబ్బాయి రమేశ్‌తో, 'ఓ ఆడది ఓ మగాడు'లో కథానాయిక తమ్ముడిగా నటించా. స్వతహాగా నాకు వినోదం అంటే ఎక్కువ ఇష్టం కాబట్టి, ఇప్పుడు వినోదాత్మక పాత్రలు చేస్తున్నా.'క్రేజీ అంకుల్స్'కు వస్తే... బంగారం షాపు యజమానిగా నటించా. నా స్నేహితులుగా రాజా రవీంద్ర, భరణి కనిపిస్తారు. 50 ఏళ్లు దాటిన ఈ ముగ్గురు స్నేహితులు ఇళ్లల్లో పెళ్లాలు తమను పట్టించుకోవడం లేదని ఫీలవుతారు. అదే సమయంలో టీవీ సింగర్ పరిచయంతో ఆమె పట్ల ఆకర్షితులవుతారు. ఆ తర్వాత ఎటువంటి సమస్యలు వచ్చాయి? ఎలా బయటపడ్డారు? అనేది కథ. శ్రీముఖి, రాజా రవీంద్రతో గతంలోషోస్ చేసి ఉండటం వల్ల చాలా జాలీగా చిత్రీకరణ చేశాం. యువతకు సందేశమిచ్చే చిత్రమిది. జనాలు థియేటర్లకు వచ్చి సినిమాచూస్తారనిఆశిస్తున్నా.ప్రస్తుతంనాలుగైదు భాషల్లో పాడుతు న్నా. అయితే, ట్రెండ్ మారడం వల్ల గతంలో కంటే తక్కువ అవకా శాలొస్తున్నాయి. డబ్బింగ్ చెబుతున్నా. రజనీకాంత్‌గారి 'అన్నాత్తే' చిత్రీకరణ పూర్తయితే, డబ్బింగ్ ప్రారంభించాలి. నటుడిగా వినోదాత్మక పాత్రలతో పాటు అన్ని తరహా పాత్రల్లోనూ నటించాలను కుంటున్నా.విలన్‌గా మాత్రం చేయను. నాకు సెట్ అవ్వదనిపిస్తోంది.

# రెడ్ డ్రెస్‌లో మెరిసిపోతున్న అందాల జాన్వీ

అతిలోక సుందరి అనే పదానికి అసలైన నిర్వచనంలా ఉంటూ ఎన్నో ఏళ్ల పాటు సినీ వినీలాకాశంలో ఓ వెలుగు వెలిగిన ధృవతార శ్రీదేవి. దక్షిణాదిలోని అన్ని భాషల్లో తన హవాను చూపించిన శ్రీదేవి.. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి సైతం అడుగు పెట్టారు. అక్కడ కూడా స్టార్ హీరోలతో కలిసి నటించారు. ఈ క్రమంలోనే శ్రీదేవి లవ్ ట్రాకుల గురించి ఎన్నో రకాల పుకార్లు షికార్లు చేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ బోనీ కపూర్‌ను పెళ్లాడిన ఆమె జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ అనే ఇద్దరు అమ్మాయిలకి జన్మనిచ్చింది.కూతుళ్లని కూడా హీరోయిన్స్‌గా చూడాలని శ్రీదేవి ఎంతో కలలు కన్నది. పెద్ద కూతురు జాన్వీ ఇండస్ట్రీకి సంబంధించి ఎన్నో ప్రయత్నాలు చేసింది. చివరకి దఢఖ్ సినిమాతో జాన్వీని పరిచయం చేసింది. అయితే ఆమె సినిమాను వెండితెరపై చూసే అవకాశం శ్రీదేవికి దక్కలేదు.అయితే తల్లి అందం,అభినయాన్ని పుణికి పుచ్చుకున్న జాన్వీ సినిమాలతోను, ఫొటోషూట్స్‌తోను అభిమానులని ఎంతగానో అలరిస్తుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో జాన్వీ చేసే ఫొటో షూట్స్ నెటిజన్స్‌కి పిచ్చెక్కిస్తున్నాయి. నాన్‌స్టాప్‌గా ఈ అమ్మడు అందాలు ఆరబోస్తూ ఫొటో షూట్స్ చేస్తుంది. తాజాగా రెడ్ లెహంగాలో క్లీవేజ్ షో చేస్తూ ఓర చూపులు చూస్తుంది. జాన్వీ మెరుపులకు ప్రేక్షకులకు మైమరచిపోతున్నారు.



# కామెడీ టైమింగ్‌తో అదరగొట్టిన సూర్యకుమార్, పృథ్వీ షా



లండన్: టీమిండియా యువ ఆటగాళ్లు సూర్యకుమార్? యాదవ్, పృథ్వీ షాలు మిమిక్రీతో అదరగొట్టారు. ఇంగ్లండ్ సిరీస్‌కు ఎంపికయిన శుబ్‌మన్ గిల్, వాషింగ్టన్ సుందర్, ఆవేశ్ ఖాన్‌లు గాయాల బారిన పడి స్వదేశానికి వెళ్లిపోయారు. వారి స్థానంలో సూర్యకుమార్, పృథ్వీ షాలు ఎంపిక చేశారు. శ్రీలంక పర్యటన ముగించుకొని నేరుగా ఇంగ్లండ్‌కు వచ్చిన వీరిద్దరు క్వారంటైన్‌కు వెళ్లిపోయారు. ఇటీవలే క్వారంటైన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సూర్య, పృథ్వీలు జట్టుతో కలిశారు. లార్డ్స్ టెస్టులో ఘన విజయం అందుకున్న టీమిండియాతో కలిసి సంబరాలు జరుపుకున్నారు.ఆగస్టు 25 నుంచి మొదలుకానున్న మూడో టెస్టుకు సిద్ధమవుతున్న వీరు తాజాగా ఒక మిమిక్రీ వీడియోతో మెప్పించారు. బాజీగర్ సినిమాలోని జానీ లీవర్, దినేష్ హింగూల క్యారెక్టర్లను ఇమిటేట్ చేసిన సూర్య, పృథ్వీలు మంచి కామెడీ టైమింగ్‌తో అదరగొట్టారు. సూర్య తన చేతిలో కాఫీ కప్ పట్టుకొని ఉండగా.. అతని వెనుకాల పృథ్వీ షా కూర్చొని ఉన్నాడు. సూర్య చేతిలో పట్టుకున్న కప్పును పృథ్వీకి చూపిస్తూ వెటకారంగా నవ్వాడు.. దీనికి పృథ్వీ కూడా అలాగే చేశాడు. "హమ్ పాగల్ నహీ హై.. హమారా దిమాక్ కరాబ్ హై" అంటూ క్యాప్షన్ జత చేశారు.ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇక లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్‌పై 151 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన టీమిండియా మూడో టెస్టుకు సిద్ధమవుతుంది. కాగా ఇరు జట్ల మధ్య మూడో టెస్టు ఆగస్టు 25 నుంచి లీడ్స్ వేదికగా జరగనుంది.

## రూట్ ఒక్కడు ఆడితే సరిపోదు.. ఇలా అయితే కష్టం

లార్డ్స్: టీమిండియాతో జరిగిన రెండో టెస్టులో ఇంగ్లండ్ ఓటమికి బ్యాటింగ్ వైఫల్యమే కారణమని అన్ని వైపుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇందుకు తగ్గట్టుగానే రెండో టెస్టులో జో రూట్ మినహా మిగతా వారెవరు చెప్పుకోదగ్గ స్కోరు నమోదు చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ ఓటమిపై ఆ జట్టు మాజీ ఆటగాడు నాసిర్ హుస్సేన్ స్పందించాడు. "లార్డ్స్‌లో ఇంగ్లండ్ ఆటతీరు బాగానే అనిపించినప్పటికి కెప్టెన్ రూట్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు కనిపిస్తుంది. ఇంగ్లండ్ టాపార్డర్‌లో బలహీనంగా తయారైంది. ఓపెనర్లు సిబ్లీ, బర్న్స్, హసీబ్ హమీద్‌లు తమ స్థాయికి తగ్గట్టు ఆడలేకపోతున్నారు. రెండో టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనరిద్దరు డకౌట్‌గా వెనుదిరగడం విశేషం. అంతేగాక వన్‌డౌన్‌లో ఆడుతున్న హమీద్ తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్.. రెండో ఇన్నింగ్స్‌లో 9 పరుగులు చేసి ఔటయ్యాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190